PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 277 | విజయవాడ, శనివారం 10 మే 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 10 May 2025 | Rs

డిప్యూటీ కలెక్టర్‌కు ఎంఆర్‌ఒగా డిమోషన్

- పేదల గుడిసెలను తొలగించిన కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు

2

ఐపిఎల్ వారం రోజులు వాయిదా

- 57మ్యాచ్‌లు పూర్తి.. 16మ్యాచ్‌లకు బ్రేక్
- డబ్బులు వాపస్ ఇస్తాం: ఫ్రాంచైజీలు



6



కొనసాగుతున్న ఉద్రిక్తతలు

ఫిరోజ్‌పూర్, ఉరీలో జనావాసాలపై పాక్ దాడి

36 ప్రాంతాల్లో డ్రోన్ దాడులు జరిగినట్లు ప్రకటించిన సైన్యం

త్రివిధ దళాధిపతులతో ప్రధాని భేటీ



పాకిస్తాన్ షెల్స్ పడుతుండటంతో ఉరీలో స్థానికులను గ్రామాల నుంచి తరలిస్తున్న సైనికులు

న్యూఢిల్లీ : భారత్, పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాడు కూడా పలు ప్రాంతాల్లో పాకిస్తాన్ చేసిన దాడులను భారత సైన్యం తిప్పికొట్టింది. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, కాశ్మీర్‌లోని ఉరీలో జనావాసాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో పలువురు గాయపడినట్లు వార్తలు వచ్చాయి. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ఈ సంఘటనతో ఫిరోజ్‌పూర్‌లో బ్లాక్ అవుట్ విధించారు. జమ్మూ-కాశ్మీర్‌లో కూడా బ్లాక్ అవుట్ కొనసాగుతోంది. రాత్రి పదిగంటల ప్రాంతంలో కశ్మీర్‌లోని అవంతిపొరా వైమానిక స్థావరంపై దాడి చేయడానికి పాకిస్తాన్ ప్రయత్నించింది. అయితే, ఈ దాడిని భారత సైన్యం తిప్పికొట్టింది. జమ్మూలో కాల్పులు, పేలుళ్ళ శబ్దాలు వినిపిస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ప్రజలు ధైర్యంగా, సహనంగా ఉండాలని ఆయన కోరారు. జమ్మూతో పాటు, సాంబా, పఠాన్‌కోట్‌లలో పాక్ డ్రోన్‌దాడులు కొనసాగాయి. ఉరి సెక్టార్‌లో కూడా పాక్‌సైనికులు మరోసారి కాల్పులు జరిపారు. ఇక్కడి జనావాసాల్లో పెద్దఎత్తున పేలుళ్ల శబ్దాళు వినిపించినట్లు వార్తలు వచ్చాయి. ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం సాయంత్రం త్రివిధ దళాధిపతులతో భేటీ అయ్యారు. దాదాపు గంటకు పైగా ఈ సమావేశం కొనసాగింది. విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కూడా ప్రధానితో సమావేశమయ్యారు. కొందరు మాజీ సైనికాధికారులు కూడా ప్రధానిని కలిశారు. 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ డ్రోన్ దాడులకు దిగినట్లు భారత సైన్యం ప్రకటించింది. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఈ వివరాలు తెలిపారు. జమ్మూకాశ్మీర్, పంజాబ్, రాజస్తాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని దాదాపు 400 డ్రోన్లతో పాక్ ఈ దాడులను చేసినట్లు వారు తెలిపారు. పాకిస్తాన్ పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగించుకుంటోందని తెలిపారు.

మరిన్ని వార్తలు.. 5లో

పాక్ కాల్పుల్లో శ్రీసత్యసాయి జిల్లా జవాను మృతి

ప్రజాశక్తి-అనంతపురం, గోరంట్ల,కలెక్టరేట్

శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన జవాను జమ్ముకాశ్మీర్‌లో వీరమరణం పొందారు. పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన జవాను మురళీనాయక్ (22) గురువారం రాత్రి పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో మరణించారు. ఈ విషయాన్ని ఆర్మీ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, జవాన్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో ఆయన కుటుంబంతోపాటు, గ్రామంలోనూ తీవ్ర విషాదం నెలకొంది. తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మురళీనాయక్ డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న రోజుల్లో 29-12-2022న అగ్నివీర్ సైనికునిగా సైన్యంలో చేరారు. ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు రెండు రోజుల క్రితమే జమ్ముకాశ్మీర్‌కు పిలిపించారు. అక్కడ జరిగిన కాల్పులో ఆయన మృతి చెందారు. ఈ విషయం తెలియడంతో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మురళీనాయక్ తల్లి దండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. మంత్రి సవితా కళ్లితండాకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐదు లక్షల రూపాయల చెక్‌ను మురళీనాయక్ తల్లిదండ్రులకు అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కూడా సంతాపాన్ని తెలియజేశారు. మురళీనాయక్ మృతికి నివాళిగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యాన అనంతపురం జిల్లా కేంద్రంలోని టవర్ క్లాక్ సర్కిల్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.



మురళీనాయక్ (ఫైల్)

ఉగ్రవాదానికి మతం లేదు

- దానిని కఠినంగా ఎదుర్కోవాలి
- కానీ, పరిస్థితులను ఉద్రిక్తంగా మార్చకూడదు
- పాకిస్తాన్‌పై అంతర్జాతీయ ఒత్తిడి తేవాలి
- విలేకరుల సమావేశంలో ఎంఎ బేబి



మాట్లాడుతున్న ఎంఎ బేబి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

'ఉగ్రవాదానికి మతం ఉండదు. మతం పేరుతో ఉగ్ర దాడులు జరుగుతున్నా ఏ మతమూ ఉగ్రవాదాన్ని బోధించదు. కొన్ని శక్తులు దీనిని వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఉగ్రవాదాన్ని కఠినంగా ఎదుర్కోవాలి. కానీ పరిస్థితులను మరింత ఉద్రక్తంగా మార్చకూడదు. ప్రజల మధ్య విభేదాలు, విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలను అరికట్టాలి.' అని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి అన్నారు. తిరుపతిలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలకు హాజరైన ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన దారుణ ఉగ్రదాడిని దేశం మొత్తం ఖండించిందని చెప్పారు. ఈ సందర్భంగా అఖిలపక్ష సమావేశంలో సిపిఎం ఎంపి జాన్‌బ్రిటాస్ చెప్పిన విషయాలను ఆయన ప్రస్తావించారు. ఆ సమావేశంలోనే ఆపరేషన్ సిందూర్ నిర్దేశించిన లక్ష్యాలను సాధించినట్లు కేంద్ర రక్షణశాఖ మంత్రి చెప్పిన నేపథ్యంలో సరిహద్దుల్లో పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాకిస్తాన్‌పై అంతర్జాతీయ ఒత్తిడి తీసుకురావాలని, పహల్గాంలో 26 మందిని హత్యచేసిన ఉగ్రవాదులను అప్పగించేటట్లు చూడాలని అన్నారు. ఇదే విషయాన్ని అఖిలపక్షంలో కూడా చెప్పినట్లు తెలిపారు. 'దేశ సమగ్రత, ప్రజల ఐక్యతను కాపాడుకోవడమే కీలకం. మిలటరీ చర్యలతోపాటు శాంతి చర్చల మార్గాన్ని కూడా చూడాలి. 'భారతదేశ ప్రజాస్వామ్య పరిపక్వతను ప్రపంచానికి చూపించే సమయం ఇది. ఆ పని చేయాలి. పాకిస్తాన్ మరో మార్గాన్ని ఎంచుకుంటే అప్పుడు దానికి తగిన విధంగా స్పందించాల్సి ఉంటుంది.' అని ఆయన అన్నారు.

సమగ్ర సామాజిక సర్వేగా కులగణన ..

కేవలం బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం కులగణన కార్యక్రమాన్ని ప్రకటించిందన్న భావన ప్రజల్లో ఉందని ఎంఎ బేబి చెప్పారు. కులగణన చేపట్టేందుకు అవసరమైన మార్గదర్శకాలు ఇప్పటి వరకు ప్రకటించకపోవడం దీనిని బలపరుస్తోందని తెలిపారు. కేవలం కులగణనతో సమస్య పరిష్కారం కాదని, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి తదితర స్థితిగతుల అధ్యయనం కూడా కలిపి సమగ్ర సర్వేగా చేస్తే ప్రజల వాస్తవ పరిస్థితి క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. కులగణనను సమగ్ర సామాజిక సర్వేగా చేపట్టాలని, అందుకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సిపిఎం దీనిపై చర్చ లేవనెత్తనుందని తెలిపారు. అక్టోబర్‌లో జరగనున్న బీహార్ ఎన్నికల పోరులో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ మతతత్వ రాజకీయ పార్టీలను ఎదుర్కొనేందుకు విశాల ప్రాతిపదికన ప్రజాస్వామ్య, అభ్యుదయ రాజకీయ శక్తులతో కలిసి వామపక్ష పార్టీలు పని చేయనున్నాయని తెలిపారు. కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర కమిటీ సమావేశంలో చర్చించి ఎన్నికల ఎత్తుగడలను రూపొందిస్తామని ఎంఎ బేబి వివరించారు. దేశాభివృద్ధికి, సమైక్యతకు, సమగ్రతకు ముప్పు కలిగించేలా పెచ్చరిల్లుతున్న మతతత్వ శక్తులను ఎదుర్కొనే ప్రధాన లక్ష్యంతో సిపిఎం పోరాటాలు చేయాలని 24వ పార్టీ అఖిల భారత మహాసభలో తీర్మానించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం బాలల మీద గణనీయమైన మతతత్వ పోకడలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీరిని చైతన్య పరిచేందుకు బాలల సంఘాల కార్యక్రమాలపై కేంద్రీకరించి పని చేయనున్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్-1 మెయిన్స్

- 75 శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించిన పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలకు 75 శాతం అభ్యర్థులు హాజరయ్యారని కమిషన్ కార్యదర్శి పి రాజబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు. వివిధ శాఖల్లో 89 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఎపిపిఎస్‌సి పరీక్షలు నిర్వహించింది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన 4,496 మంది అభ్యర్థులకు రాష్ట్ర వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించింది. వీరిలో 75 శాతం హాజరయ్యారు. కంప్యూటర్ ఆధారితంగా జరిగిన ఈ పరీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎపిపిఎస్‌సి నిర్వహించింది.

జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రాలపై బలవంతంగా రుద్దలేం: సుప్రీం



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడుల్లో కచ్చితంగా జాతీయ విద్యా విధానం అమలుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జాతీయ విద్యావిధానాన్ని అమలుచేయాలని ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేమని జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉంటే మాత్రం ఆ విషయంలో కోర్టు జోక్యం చేసుకోవచ్చని తెలిపింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ రాజ్యాంగపరంగా విద్యావిధానాన్ని అమలుచేయాలని పేర్కొంటూ ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేశవ్యాప్తంగా విద్యలో ఏకరూపకతను నెలకొల్పడానికి కేంద్రం ఎన్ఇపి విధానాన్ని అమలుచేయాలని యోచిస్తోందని, పలు రాష్ట్రాలు ఈ విధానాన్ని అనవసరంగా రాజకీయ సమస్యగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ కేసుతో తనకేం సంబంధం ఉందని సుప్రీంకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించగా.. తాను తమిళనాడుకు చెందిన వ్యక్తినని.. ప్రస్తుతం ఢిల్లీలో స్థిరపడ్డానని తెలిపారు. దేశ రాజధానిలో స్థిరపడినప్పుడు వివిధ రాష్ట్రాల్లో జాతీయ విద్యావిధానం అమలు గురించి పిటిషన్ దాఖలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తూ.. కోర్టు పిటిషన్‌ను కొట్టేసింది. తన పిల్లలు ఢిల్లీలో హిందీ నేర్చుకోవడం కొనసాగించవచ్చని పిటిషనర్‌కు తెలిపింది.

ఎన్ఇపి విషయంలో తమిళనాడు - కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోంది. రాజకీయ అభిప్రాయ విభేదాలకు అతీతంగా దీన్ని అమలుచేయాలని స్టాలిన్‌కు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల ఓ లేఖలో సూచించారు. తమిళ భాషకు, ప్రజలకు, రాష్ట్రానికి నష్టం కలిగించే చర్యలను అనుమతించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి పలుమార్లు స్పష్టంచేశారు. మరోవైపు.. జాతీయ విద్యావిధానాన్ని ఆమోదిస్తేనే తమిళనాడుకు నిధులు విడుదలవుతాయంటూ కేంద్ర ప్రభుత్వం షరతులు పెడుతోంది.

త్వరలోనే 'తల్లికి వందనం'

- కేంద్రంతోపాటు కలిపి అన్నదాతకు డబ్బులిస్తాం
- ఉచిత గ్యాస్ సిలిండర్ల డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే యోచన : ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'హంద్రీనీవా' కాలువ వెడల్పు పనుల పరిశీలన



ఛాయపురం వద్ద ప్రజావేదికలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ఎన్నికల హామీ మేరకు త్వరలోనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్లకు నగదును నాలుగు నెలలకు ఒకసారి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఆయన అనంతపురం జిల్లాలో పర్యటించారు. వజ్రకరూరు మండలం ఛాయపురం గ్రామం వద్ద హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పరిశీలించారు. వీటిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని అధికారులను అడిగారు. 50 రోజుల్లోపు పూర్తి చేస్తామని హంద్రీనీవా ఎస్ఇ బదులిచ్చారు. ప్రస్తుతం 1,500 క్యూసెక్కులు మాత్రమే నీటి ప్రవాహం కాలువ గుండా ఉందని, వెడల్పు పూర్తయితే 3,500 క్యూసెక్కుల వరకు నీటిని తీసుకునే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి ఎస్ఇ తెలియజేశారు. అనంతరం ఛాయపురం వద్ద నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి చంద్రబాబు హాజరయ్యారు. దీనికి ముందు పాకిస్తాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన సైనికుడు మురళీనాయక్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం 'తల్లికి వందనం' పథకం కింద సాయం అందిస్తామని, చదువుతున్న పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని తెలిపారు. అన్నదాతలకు ఇస్తామని చెప్పిన నగదు ప్రోత్సాహకాన్ని కేంద్రంతో కలిపి ఇస్తామన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం మెగా డిఎస్‌సిని నిర్వహిస్తున్నామని తెలిపారు. సాగునీటి రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోం దన్నారు. పోలవరం నుంచి బనకచర్లకు నీటి మళ్లించే ఆలోచన చేశామని తెలిపారు. ఇందుకోసం 3,089 కిలోమీటర్ల మేర కాలువలు తీయాల్సి ఉంటుం దన్నారు. ఇందుకు రూ.81 వేల కోట్లు అవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 300 టిఎంసిల మిగతా 5లో

సజ్జలను విచారించిన సిఐడి

- దేవినేని అవినాష్‌ను కూడా...
- టిడిపి కార్యాలయంపై దాడి కేసు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి



సిఐడి కార్యాలయానికి వెళ్తున్న సజ్జల

టిడిపి రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులో వైసిపి నాయకులు, ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డిని గుంటూరులోని సిఐడి కార్యాలయంలో అధికారులు శుక్రవారం విచారించారు. ఈ దాడికి సంబంధించి పలు ప్రశ్నలను సిఐడి అధికారులు ఆయనను అడిగారు. సజ్జలతోపాటు విజయవాడ వైసిపి నాయకులు దేవినేని అవినాష్ కూడా సిఐడి విచారణకు హాజరయ్యారు. సజ్జల వాహనాన్ని పోలీసులు కోర్టు రోడ్డు వద్దనే నిలిపివేశారు. దీంతో, ఆయన అక్కడి నుంచి సిఐడి కార్యాలయం వరకు నడుచుకుంటూ వెళ్లారు. సిఐడి అధికారుల ప్రశ్నలకు 'నాకు 'తెలియదు. గుర్తు లేదు, నాకేం సంబంధమూ లేదు' అంటూ సజ్జల సమాధానం ఇచ్చినట్టు సమాచారం.

బదులు తీర్చుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయి : సజ్జల

రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, తాము బదులు తీర్చుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని సజ్జల అన్నారు. సిడిఐ విచారణ అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడారు. తనపై అక్రమ కేసు బనాయించినా బాధ్యత కలిగిన పౌరుడిగా విచారణకు వచ్చానని తెలిపారు. టిడిపి నాయకులు కొమ్మారెడ్డి పట్టాభి అప్పటి సిఎం వైఎస్.జగన్‌ను దుర్భాషలాడిన నేపథ్యంలో ఆ పార్టీ కార్యాలయంపై దాడి జరిగి ఉండవచ్చని చెప్పారు. తాడికొండ మండలం కంతేరు ఎంపిటిసిపై కూడా దురుసుగా ప్రవర్తించారని, మహిళల పట్ల పోలీసులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని, కాలం ఎప్పుడూ ఇలాగే ఉండదని, భవిష్యత్తులో తాము అధికారంలోకి వచ్చి ఇలాగే మొదలుపెడితే ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలని అన్నారు. పోసాని ఎప్పుడో మాట్లాడితే ఇప్పుడు కేసు పెట్టారని, సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటికి ఎలాంటి అనుమతీ లేకుండా పోలీసులు వెళ్లి ఇంట్లో సోదాలు చేశారని తెలిపారు. ఇలాంటి ఉన్మాద చర్యలు ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయో ఆలోచించాలన్నారు. ఇంకా ఎంతమందిని జైలులో పెడతారని ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్ కూడా తప్పుడు కేసేనని తెలిపారు. సజ్జలకు సంఘీభావంగా సిఐడి కార్యాలయం వద్దకు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసిపి జిల్లా నాయకులు వచ్చారు.



రెడ్ స్క్వేర్‌లో ఘనంగా విక్టరీ డే పరేడ్ ఉత్సవాలు

- కళ్లు చెదిరేలా 11 వేల మంది పైగా సైనికుల కవాతు
- 30 మందికి పైగా ప్రపంచ నేతల హాజరు
- రష్యా ఫోబియాకు వ్యతిరేకంగా పోరు కొనసాగుతుందన్న పుతిన్

5

మాజీ సైనికులు, రక్షణ సిబ్బందికి ఆస్తి పన్ను మినహాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీల పరిధిలో నివాసం ఉంటున్న మాజీ సైనికులు, రక్షణ శాఖ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఆస్తి పన్నులో మినహాయింపు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైనిక సంక్షేమ అధికారి అభ్యర్థనను పరిశీలించిన అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ 2003 నవంబరు 20న జారీ చేసిన ఉత్తర్వులకు సవరణ చేశారు. ఆయా పంచాయతీల పరిధిలో మాజీ సైనికులు, రక్షణశాఖ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల పేర్లతో ఒకటి కంటే ఎక్కువ ఆస్తులు ఉన్నప్పటికీ ఒక ఆస్తికే పన్ను మినహాయింపు ఇస్తారు. ఆస్తికి సంబంధించి అంతస్తులపై ఎటువంటి అభ్యంతరం లేనప్పటికీ ఆస్తి మొత్తం వారి ఆధీనంలో ఉండాలన్నారు. ఇతరులకు అద్దెకు ఇస్తే పన్ను మినహాయింపు వర్తించదు. పంచాయతీలో ఉన్న అసెస్మెంట్లలో ఇటువంటివి 10 శాతం కంటే ఎక్కువ ఉంటే మినహాయింపును 50 శాతానికి పరిమితం చేసే అధికారాన్ని పంచాయతీ పాలకవర్గాలకు కల్పించారు. ఇతర పంచాయతీల్లో వంద శాతం పన్ను మినహాయింపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా గ్రీష్మ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
శాసనమండలి సభ్యులుగా కావలి గ్రీష్మ ప్రమాణస్వీకారం చేశారు. అసెంబ్లీలోని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తన కార్యాలయంలో గ్రీష్మతో శుక్రవారం ప్రమాణం చేయించారు. అనంతరం శాసనమండలి నియమ, నిబంధనలకు సంబంధించిన కిట్‌ను ఆమెకు ఛైర్మన్ అందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, శాసనసభ మాజీ స్పీకర్ ప్రతిభా భారతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ కోసం డ్యాష్‌బోర్డు

- ఏఐసిటిఇతో కలిసి ఉన్నత విద్యామండలి ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
వేసవి కాలంలో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందించేందుకు ఏఐసిటిఇతో కలిసి ఉన్నత విద్యామండలి డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసింది. ఈ డ్యాష్‌బోర్డును ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె మధుమూర్తి ఏఐసిటిఇ చీఫ్ కో-ఆర్డినేటర్ ఆఫీసర్ బుద్ధా చంద్రశేఖర్, మద్రాస్ ఐఐటి ప్రొఫెసర్ పార్థసారధితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు మూడు రకాల ఇంటర్న్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. స్టైఫండ్ ఆధారిత, ఉచిత ఇంటర్న్‌షిప్, నగదు చెల్లించడం వంటివి ఉన్నాయి. విద్యార్థులు internship.aicte-india.org వెబ్‌సైట్‌లో స్టూడెంట్ ట్యాబ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుని నమోదు చేసుకోవాలి. స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ ఎంపిక చేసుకున్న విద్యార్థులు ఆపార్ ఐడి, ఫోన్ నెంబర్‌ను కచ్చితంగా చేయాల్సి ఉంది. ఏఐసిటిఇ డ్యాష్‌బోర్డులో త్వరలోనే icc.apsche.ap.gov.in పోర్టల్‌ను ఉన్నత విద్యామండలి ప్రారంభించనుంది.

బాధిత మహిళలపై ట్రోల్స్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు

- ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
బాధిత మహిళలు, లౌకిక విలువలు, ప్రజల ఐక్యత కోసం మాట్లాడే మహిళల గురించి అశ్లీలంగా వ్యాఖ్యానిస్తూ సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రోలింగ్‌లో పాల్గొన్న వ్యక్తులను గుర్తించి వారిపై బిఎన్ఎస్ సమాచార సాంకేతిక చట్టం, ఇతర సంబంధిత చట్టాల కింద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో తన భర్త, నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్‌నర్వాల్‌ను కోల్పోయిన హిమాన్షీ నర్వాల్‌కు, తండ్రిని కోల్పోయిన ఆరతికి తమ పూర్తి సంఘీభావాన్ని, మద్దతును ఐద్వా రాష్ట్ర కమిటీ ప్రకటిస్తుందన్నారు. పహల్గాం ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు, పక్కన బాధితుడు

ఒంగోలు జిజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

- వెన్నెపూస మధ్యలో ఏర్పడిన గడ్డకు సర్జరీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్
ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జిజిహెచ్) వైద్యులు మరో అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వెన్నెపూస మధ్యలో ఏర్పడిన గడ్డకు సర్జరీను విజయవంతంగా పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.ఏడుకొండల రావు అధ్యక్షతన జరిగిన ప్రెస్‌మీట్‌లో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ గోపీకృష్ణ వివరించారు. నాగులుప్పలపాడు మండలం, రాపర్ల మాచవరం గ్రామానికి చెందిన గడ్డం ఇస్సాకు (40) భవన నిర్మాణ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. గత తొమ్మిది నెలలుగా కాళ్ళు, చేతులు తిమ్మిర్లు పట్టడం, నడవలేని స్థితిలో వుండటం, బరువులు ఎత్తడం కష్టం కావడం, వంటి సమస్యలతో ఇస్సాకు బాధపడుతూ పలు ఆసుపత్రులలో చూపించాడు. స్నేహితుల సహాయంతో ఒంగోలు జిజిహెచ్‌లోని న్యూరాలజీ వైద్యులను సంప్రదించాడు. పలు పరీక్షలు చేసి అనంతరం వెన్నుపూసలో ట్యూమర్(గడ్డ) కారణంగా ఇలాంటి సమస్య వచ్చినట్లు వైద్యులు గుర్తించారు. వెన్నెపూసలోని సి3, సి4 వద్ద ట్యూమర్‌ను గుర్తించి,కుటుంబసభ్యుల సమ్మతితో న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో తాను, న్యూరో సర్జన్స్ డాక్టర్ వలి బాబు షేక్, డాక్టర్ మురళీకృష్ణ బృందం కొన్ని గంటల పాటు శ్రమించి సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. లమెక్టమి పద్ధతిలో జరిగిన సర్జరీతో నేడు ఇస్సాకు సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ స్థితికి వచ్చారు. ఈ సందర్భంగా ఇస్సాకు మాట్లాడుతూ.. ఎన్నో ఆసుపత్రులు తిరిగినా వ్యాధికి పరిష్కారం దొరకలేదని, జిజిహెచ్ వైద్యులు ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఒక్క పైసా ఖర్చు లేకుండా నయం చేశారన్నారు. సర్జరీ చేసిన వైద్యుల బృందానికి ఇస్సాకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, డిప్యూటీ సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ వి.చెంచయ్య, న్యూరో సర్జన్స్ డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ వలీ బాబు షేక్, డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

పేదల గుడిసెలను తొలగించిన

డిప్యూటీ కలెక్టర్‌కు ఎంఆర్‌ఓగా డిమోషన్

- సుప్రీం సంచలన తీర్పు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి పేదల గుడిసెలను తొలగించిన డిప్యూటీ కలెక్టర్ తాతా మోహనరావు విషయంలో సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలోని జిఎడిలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ప్రోటోకాల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను ఎంఆర్‌ఓగా డిమోషన్ చేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. గుంటూరు తహశీల్దార్‌గా పనిచేసిన మోహన్‌రావుకు గుంటూరులోని ఒక ప్రాంతంలో గుడిసెలను తొలగించవద్దని 2013 డిసెంబర్ 11న హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలను ఉల్లంఘించి 2014 జనవరిలో బలవంతంగా గుడిసెలను తొలగించారు. ఉద్దేశపూర్వకంగా ఉత్తర్వులను పాటించకపోవడంతో ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన మోహన్‌రావుకు రాష్ట్ర హైకోర్టు రెండు నెలల జైలుశిక్ష విధించింది. ఈ తీర్పుపై డిప్యూటీ కలెక్టర్ మోహన్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'అధికారులు తాము చట్టానికి అతీతులమన్న భావన కలిగి ఉండకూడదు. ఒకసారి కోర్టు హెచ్చరించింది. అయినా తిరిగి అదే చర్య చేశారు. ఆయనను ఎలా క్షమించాలి. ఆయన హైకోర్టు కన్నా పెద్దవాడని అనుకుంటున్నారు. ఎన్ని కుటుంబాలను ఖాళీ చేయించారు. 80 మంది పోలీసులతో వెళ్లి హైకోర్టు ఆదేశాల్ని విస్మరించారు. ఆయన 48 గంటలు కస్టడీలో ఉంటే ఉద్యోగం పోతుంది' అంటూ జస్టిస్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి అధికారికి హైకోర్టు ఆదేశాలను పాటించాల్సిన బాధ్యత ఉందని తెలుసుకోవాలని స్పష్టం చేశారు. 'ఆయన ప్రభుత్వానికి దగ్గరగా ఉన్నారనేది స్పష్టంగా ఉంది. మీరు ఎంత ఉన్నత పదవిలో ఉన్నా... కోర్టు ఆదేశాలను ధిక్కరించకూడదు అనే సందేశం దేశవ్యాప్తంగా వెళ్లాలని కోరుకుంటున్నాం' అని జస్టిస్ గవాయ్ అన్నారు. డిప్యూటీ కలెక్టర్ కొంతకాలం ప్రభుత్వ అతిథిగా ఉండాలని వ్యాఖ్యానించారు. హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘించిన మోహన్‌రావుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సిఎస్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. డిప్యూటీ కలెక్టర్‌కు ఇద్దరు చిన్న పిల్లలున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జోక్యం చేసుకున్న న్యాయమూర్తి గవాయ్, ఆయన ఎన్నో కుటుంబాలను ఖాళీ చేయించారని, వారి పిల్లలు ఏమవుతారు అని ప్రశ్నించారు. 'పిటిషనర్ గుడిసె వాసుల ఇళ్లను కూల్చివేసి రోడ్డుపై పడేసినప్పుడు ఇవన్నీ ఆలోచించి ఉండాలి. ఆయన ఇప్పుడు మానవీయ వైఖరిని ఆశిస్తే, ఆయన అమానుషంగా ప్రవర్తించకూడదు. ఆయన ప్రవర్తనలో మానవీయ దృక్పథం లేదు. మేము ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి ఉండేవాళ్లం. చట్టం గొప్పతనం శిక్షించడంలో కాదు, క్షమించడంలో ఉంది అని మాకు గుర్తు చేస్తోంది. పిటిషనర్ ఎటువంటి దయగల విధానానికి అర్హులు కాదని భావిస్తున్నాం. పిటిషనర్ మొండి, నిర్దయాత్మక వైఖరి కారణంగా ఆయన పిల్లలు, కుటుంబం బాధపడకూడదని అనుకుంటున్నాం' అని ధర్మాసనం ఆదేశాల్లో పేర్కొంది.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని ఆ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. తాగునీరు, విద్య, వైద్యం వంటి సదుపాయాలను అందు బాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 9 ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో విజయవాడలోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జూన్ నాటికి అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఇందుకు రూ.156 కోట్లు మంజూరు చేసి, పనులు ప్రారంభించా మన్నారు. 4 వేలకుపైగా గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాలతో ఐసిడిఎస్ కార్యక్రమాలను అనుసంధానం చేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో పిల్లలకు మంచి పోషకారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, రెండు వేల అంగన్వాడీ కేంద్రాలు, 1,268 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఇక్కడ ఉన్నాయన్నారు. పూరి గుడిసెల్లో ఉన్నవారికి పక్కా ఇళ్లు కట్టించనున్నట్లు తెలిపారు. పాడేరు, శ్రీశైలం ప్రాంతాల్లో ఎక్కువగా గిరిజనులు ఉన్నట్లు గుర్తించామని, వీరిలో కొందరికి ఆధార్, రేషన్ కార్డులు లేవని తెలిపారు. వీరికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో వైద్యులను నియమించినా వారు అక్కడ ఉండటం లేదని, అందువల్ల గిరిజనులకు వైద్య సేవలు అందించడం సాధ్యం కావడం లేదన్నారు. పట్టణాల్లో కంటే గిరిజన గ్రామాల్లోనే సాధారణ ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. మెగా డిఎస్‌సిలో 2 వేల పైచిలుకు ఉద్యోగాలు గిరిజనులకు ఉన్నాయని,దీనివల్లయువతకుప్రయోజనం ఉంటుందన్నారు. జిఒ నంబరు 3 గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదని, అందుకే సుప్రీంకోర్టు ఆ జిఒను కొట్టేసిందన్నారు. దీని స్థానంలో కొత్త జిఒ తీసుకొచ్చే అంశం పరిశీలనలో ఉందని తెలిపారు. విజయవాడ, నెల్లూరు ఐటిడిఎల్లో గిరిజన ప్రాంతాలు లేకపోవడంతో వీటిని అధికారికంగా చూపలేకపోతున్నట్లు చెప్పారు. డోలీ మోతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులు, ఐటిడిఎ పిఒలు పాల్గొన్నారు.

రెండోదశ పూలింగుపై అన్నీ అనుమానాలే

- గ్రామసభల్లో ప్రశ్నిస్తున్న రైతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
అమరావతి రాజధాని విస్తరణలో భాగంగా తాడికొండ, అమరావతి, మంగళగిరి రూరల్ మండలాల్లోని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో దశ భూసమీకరణ ప్రక్రియపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తొలిదశలో సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకే ఇప్పటి వరకూ ఏమీ ఇవ్వలేదని, కొత్తగా తీసుకుని ఏమి చేస్తారనే ప్రశ్నలు వారి నుండి ఎదురవుతున్నాయి. రెండోదశ పూలింగులో మొత్తం 44,676.64 ఎకరాలు సమీకరణ కింద తీసుకోనున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పూలింగుకు గతంలో గ్రామసభల్లో ముందుగానే ప్రచారం చేశారు. అధికారులు వెళ్లి రైతులు చెప్పిందంతా రాసుకున్నారు. ఈసారి గ్రామసభలను మాత్రం పూర్తిగా రాజకీయ పరమైన కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూర్చుని వారి ముందే రైతులతో మాట్లాడించి ఆమోదం ఇచ్చినట్లు రాసుకుంటున్నారు. పెదకూరపాడు నియోజకవర్గం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో రైతుల్లో కొంతమంది పూలింగుకు ముందుకు వచ్చినా పలు అనుమానాలు వ్యక్తం చేశారు. తాడికొండ, మంగళగిరి రూరల్ మండలాల పరిధిలో రైతులు అసలు పూలింగుపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ భూములు ఇప్పటికే పూర్తిగా అభివృద్ధి చెంది ఉన్నాయని, ఇన్నర్ రింగు రోడ్డుపడితే గుంటూరు, అమరావతి, విజయవాడ కలిసిపోతాయని, అలాంటప్పుడు తమ భూములు ఎందుకు తీసుకుంటున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. పైగా తాడికొండ మండలంలో ఎక్కువగా రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయి. అవన్నీ కూడా ఎకరాల నుండి గజాల లెక్కకు మారిపోయాయి. ఇప్పుడు వాటిని ఏ పద్ధతిలో తీసుకుంటారో చెప్పాలనీ రైతులు ప్రశ్నిస్తున్నారు. కంతేరు రైతుల భూములు పూర్తిగా జాతీయ రహదారికి అనుకుని ఉన్నాయి. వాటిని సమీకరణ చేయాల్సిన అవసరం ఏమిటో తెలియడం లేదని చెబుతున్నారు. తీసుకుంటే కంతేరు పరిధిలో ఉన్న అన్ని లేఅవుట్లనూ తీసుకోవాలని, కేవలం సాగులో ఉన్న భూములను తీసుకుంటే రైతుల నోట్లో మట్టికొట్టినట్లేనని అక్కడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఇచ్చే ప్లాట్లను బ్యాంకుల్లో తనఖా పెట్టుకుని వెంటనే రుణాలు ఇచ్చేలా చూడాలని కోరుతున్నారు. ప్రధాని సభ పూర్తయినప్పటి నుండి అన్ని గ్రామాల్లోనూ ఇదే అంశాలపై చర్చ జరుగుతోంది. పదేళ్ల క్రితం తుళ్లూరు మండల పరిధిలో తీసుకున్న భూములకే ఇప్పటికీ న్యాయం జరగలేదని, వారి భూముల్లో నిర్మాణాలకు అనుమతులు లేవని, మరి మా భూముల్లో ఎప్పటికి అనుమతులు ఇస్తారో చెప్పాలని వారు సభకు వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. కొత్తగా తీసుకునే భూముల్లో ఏమేమి అభివృద్ధి పనులు చేపడతారో చెప్పాలనీ కోరారు. టెక్నాలజీకి సంబంధించి కంపెనీలన్నీ విశాఖలో పెడుతున్నప్పుడు ఇక్కడ ఏర్పాటు చేస్తే స్మార్ట్ కంపెనీలు ఏమిటని వారు ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటి వరకూ రెండు విడతులగా ఐదు గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో రైతులు ఇవే అనుమానాలు వ్యక్తం చేశారు. గతంలోనూ మూడేళ్లలో రైతులకు న్యాయం చేస్తామని చెప్పారని, పదేళ్లు అయినా ఇంతవరకు అతీగతి లేదని, అలాంటప్పుడు అదనంగా తీసుకునే భూములకు సంబంధించి ఏమి చేస్తారో ముందుగానే స్పష్టత ఇవ్వాలని రైతులు కోరారు. ఎకరాకు రూ.60 వేలు పరిహారం ఇవ్వడం తోపాటు అంతకుముందు అమల్లో ఉన్న ప్రతిఏటా పదిశాతం పెంపుదలను అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


అమరావతి మండలంలో ఇటీవల నిర్వహించిన గ్రామసభ (ఫైల్)

ధర్మ యుద్ధానికి మద్దతు : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్‌పై చేస్తున్న ధర్మ యుద్ధానికి ప్రతి ఒక్కరి నైతిక మద్దతు సైనికులు, దేశ నాయకత్వానికి బలం తోడవ్వాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులకు షష్ఠ షణ్ముఖ క్షేత్రాల్లో జనసేన పూజలు చేయించాలని సూచించారు. ఈ నెల 11న తిరుత్తణి, తిరుచెందూరు, పళని, తిరుపరంకుంద్రమ్, స్వామిపలై, పలముదిరచోళై క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేయించాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ప్రతిక్షేత్రానికి ఒక జనసేన ఎమ్మెల్యే, కార్యకర్తలు వెళ్లాలని తెలిపారు. కర్ణాటకలోని కుక్కే, ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రాలు, రాష్ట్రంలోని మోపిదేవి, బిక్కవోలులోని సుబ్రహ్మణ్య ఆలయాలు, ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, పిఠాపురంలోని పురుహూతిక ఆలయాల్లో పూజలు చేయించాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లిలోని శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో సైన్యానికి సూర్యశక్తి తోడుండేలా పూజలు చేయించాలని కోరారు. క్రైస్తవ ధర్మాన్ని నమ్మేవారు చర్చిల్లో, ఇస్లాం ధర్మాన్ని ఆచరించేవారు మసీదుల్లో ప్రార్థనలు చేపట్టాలని పవన్‌కల్యాణ్ సూచించారు.

'యాక్సిస్' ఒప్పందం రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం
యాక్సిస్, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్, సర్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, టెక్కలి, కొత్తూరు, రణస్థలంలో విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద శుక్రవారం ధర్నాలు నిర్వహించారు. శ్రీకాకుళంలోని ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. యూనిట్ విద్యుత్‌ను రూ.4.60 చొప్పున కొనుగోలు చేసేందుకు యాక్సిస్ కంపెనీతో రాష్ట్ర డిస్కమ్‌లు కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు సిఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పెంచడం ప్రజలను దగా చేయడమేనన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగులగొట్టాలని చెప్పి, ఇప్పుడు వాటిని పెట్టడం దుర్మార్గమని తెలిపారు. రాష్ట్ర ప్రజలపై పాతికేళ్ల పాటు రూ.15 వేల కోట్ల భారం వేసే ఈ ఒప్పందాన్ని ఎపిఇఆర్‌సి ఆమోదముద్ర వేయడం అన్యాయమన్నారు. విద్యుత్ కొనుగోలు పేరుతో ప్రజలపై అదనపు భారం మోపేలా కుదుర్చుకున్న యాక్సిస్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

జగన్ జడ్ ప్లస్ భద్రత కేసులో కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

- కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం
- వేసవి సెలవుల తర్వాత విచారణ

ప్రజాశక్తి-అమరావతి
సిఆర్‌పిఎఫ్ లేదా ఎన్ఎస్‌జితో కూడిన జెడ్ ప్లస్ భద్రత కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తర్వులివ్వాలంటూ మాజీ సిఎం వైఎస్ జగన్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని శుక్రవారం హైకోర్టు విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రతివాదులైన కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) డైరెక్టర్, సిఆర్‌పిఎఫ్ డిజి, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి) డిజి, రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శికి నోటీసులిచ్చింది. తదుపరి విచారణ వేసవి సెలవుల తర్వాత జరుపుతామని జస్టిస్ ఎస్ సుబ్బారెడ్డి ప్రకటించారు. జగన తరపున న్యాయవాది వై నాగిరెడ్డి వాదిస్తూ, పిటిషనర్‌కు భద్రత కల్పన విషయంలో రాష్ట్రం పూర్తిగా నిర్లక్ష్యంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకం లేనందున సిఆర్‌పిఎఫ్ లేదా ఎన్ఎస్‌జీ భద్రత కల్పించేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు గతంలోనే పిటిషనర్ కేంద్ర హోంశాఖకు వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. జగన్‌కు ప్రాణహాని ఉందని, రాష్ట్రంలో ఇటీవల జగన్ చేసిన పర్యటనల సమయంలో జరిగిన ఘటనల ను పరిశీలిస్తే ప్రమాదం ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి పొన్నారావు ప్రతివాదన చేస్తూ, కౌంటర్ వేసేందుకు గడువు కావాలని కోరారు. రాష్ట్రం తరపున ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ, జగన్ ఇదే తరహా వ్యాజ్యాన్ని గతంలోనే దాఖలు చేశారని గుర్తు చేశారు. వాదనల తర్వాత హైకోర్టు, ప్రతివాదులకు నోటీసులిచ్చి విచారణను వాయిదా వేసింది.

డిజిటల్ మార్కెటింగ్‌పై దృష్టి : సిసోడియా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
డిజిటల్ మార్కెటింగ్ విధానంపై ఆప్కో, లేపాక్షి సంస్థలు దృష్టి సారించాలని చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా సూచించారు. అమ్మకాలను ఆధునీకరణ క్రమంలో మొబైల్ యాప్ అభివృద్ధి, వాట్సాప్‌తో విక్రయాలు వంటివి చేపట్టాలన్నారు. విజయవాడలోని ఆప్కో కార్యాలయంలో ఆప్కో, లేపాక్షి సంస్థలపై సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ఉత్పత్తులు ఒకే షోరూమ్‌లో అందుబాటులో ఉండే విధంగా సమాఖ్య పద్ధతిలో వీటిని అభివృద్ధి చేయాలన్నారు. వినియోగంలో లేని స్థిరాస్తులను గుర్తించి వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. మొత్తం ఆర్థిక కార్యకలాపాలకు ఒకే బ్యాంక్‌ను భాగస్వామిగా ఎంపిక చేయాలని, ఆ బ్యాంక్‌తోనే సిఎస్ఆర్ నిధులు, తక్కువ వడ్డీ రేట్లు, ఉచిత సాఫ్ట్‌వేర్ వంటి సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉత్పత్తుల విభిన్నత, బ్రాండింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలని, కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేసి ఆధునిక మార్కెట్‌కు అనుగుణంగా మలచాలని సూచించారు. విదేశీ విపణిలో ప్రవేశానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, ముఖ్యంగా అమెరికాలో ఉంటున్న భారతీయులను లక్ష్యంగా చేసుకుని ఉత్పత్తులు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆప్కో జిఎంలు నాగేశ్వరరావు, రాజారావు, లేపాక్షి సీనియర్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐపిఎస్ జాషువాకు ఊరట

ప్రజాశక్తి-అమరావతి : స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరించి లంచాల వసూళ్లకు పాల్పడ్డారనే అభియోగాల కేసులో ఐపిఎస్ అధికారి పి జాషువాకు హైకోర్టులో వెసులుబాటు లభించింది. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం.. జాషువాకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఎసిబిని హైకోర్టు ఆదేశించింది. కేసు దర్యాప్తునకు సహకరించాలని జాషువాను ఆదేశించింది. కేసు వివరాలను బహిర్గతం చేయరాదని షరతులు విధిస్తూ జస్టిస్ టి మల్లికార్జునరావు శుక్రవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి

- పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి శ్రేణులకు ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కోరారు. టిడిపి కార్యాలయంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడోరోజైన శుక్రవారం పల్లా శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. దుర్మార్గం, దౌర్జన్యాలను ఎండగడుతూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని కోరారు. మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పార్టీ పొలిటికల్ యాక్షన్ కమిటీ నాయకులు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జవాన్ మురళికి నివాళి

జవాన్ మురళీనాయక్‌కు టిడిపి కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. ముందుగా నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ అధ్యక్షులు ధారూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



పెరగనున్న ఎండల తీవ్రత

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, శనివారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా 42 నుంచి 43.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మన్యం జిల్లా పాలకొండ, తూర్పుగోదావరి జిల్లా గోకవరం, కాకినాడ జిల్లా ఏలేశ్వరం ప్రాంతాల్లోని మూడు మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. విజయనగరంలో 8, పార్వతీపురం మన్యం 9, అల్లూరి సీతారామరాజు 3, కాకినాడ 2, తూర్పుగోదావరి 1 మండలాల్లో మొత్తంమీద 23 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశముందన్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా దరిమడుగులో 42 డిగ్రీలు, తిరుపతి జిల్లా గంగుడుపల్లెలో 41.4, నంద్యాల జిల్లా దొర్నిపాడులో 40.9, శ్రీకాకుళం జిల్లా కొల్లివలసలో 40.7, చిత్తూరు జిల్లా పిపల్లి, నెల్లూరు జిల్లా దగదర్తిలో 40.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు.

పొగాకు వ్యాపారుల సిండికేట్

- రోజూ 25 శాతం బేళ్ల కొనకుండా తిరస్కరణ
- చోద్యం చూస్తున్న కేంద్ర ప్రభుత్వం
- సమాఖ్యను రంగంలోకి దించేందుకు సిద్ధం కాని రాష్ట్ర ప్రభుత్వం
- సీలింగ్ ధర రూ.280 కొనసాగింపు



ప్రజాశక్తి – ఒంగోలు బ్యూరో

పొగాకు వ్యాపారులు సిండికేట్ అయ్యారు. సీలింగ్ ధరకు మించి కొనుగోలు చేయడం లేదు. పైగా, కుంటి సాకులతో రోజూ 25 శాతం బేళ్లను కొనకుండా తిరస్కరిస్తున్నారు. అయినా, కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోంది. పొగాకు సమాఖ్యను రంగంలోకి దించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావడం లేదు. దీంతో, ధర గిట్టుబాటు కాక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది పెట్టుబడులు పెరిగినందున కిలోకు కనీసం రూ.300 ధర వస్తేనే బయటపడతామని వారు అంటున్నారు. రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లు మార్చిలో ప్రారంభమైంది. వేలం ప్రక్రియ ఊపందుకోలేదు. పేరుకే వేలం తప్ప వ్యాపారులు పోటీపడి కొనడం లేదు. వేలంలో తక్కువ మంది మాత్రమే పాల్గొంటున్నారు. ఆరంభం నుంచి సీలింగ్ ధర కిలోకు రూ.280 మాత్రమే అమలు చేస్తున్నారు. ఒక్క రూపాయి కూడా పెంచడం లేదు. మంత్రి డోలా వీరాంజనేయస్వామి ఇటీవల ఒంగోలు కేంద్రాన్ని సందర్శించిన రోజు కూడా వేలంలో వ్యాపారులు ఎక్కువ మంది లేరు. ధర ఒక్క రూపాయి కూడా పెంచలేదు. వ్యాపారుల తీరుపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేసి దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. సిపిఎం నేతలు, రైతు సంఘం నేతలు వేలం కేంద్రాలను సందర్శించి పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వైసిపి నేతలు కూడా వేలం కేంద్రాలను సందర్శించారు. వ్యాపారుల సిండికేట్ దోపిడీ మాత్రం సాగుతోంది. కిలో పొగాకుకు రూ.280 గరిష్ట ధర ఇస్తున్నారు. కనిష్ట ధర రూ.200 ఉంది. సగటు ధరలు నల్లరేగడి నేలల్లో పండించిన పొగాకుకు రూ.257, తేలిక నేలల్లో పండించిన పొగాకుకు రూ.260 మాత్రమే దక్కుతోంది. గరిష్ట ధర ఇచ్చే బేళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. రోజూ కేంద్రాలకు వచ్చే బేళ్లలో 25 శాతం పొగాకును కొనకుండా తిరస్కరిస్తున్నారు. వారం రోజులపాటు గ్రేడింగ్ చేసి కేంద్రానికి పొగాకు తీసుకొచ్చినా వివిధ కుంటిసాకులతో వ్యాపారులు కొనకుండా తిరస్కరిస్తున్నారు. దీంతో, ఇంటికి తీసుకుపోయి మళ్లీ నెల రోజులు ఆగి తీసుకురావాల్సి వస్తోంది. దీనివల్ల రైతులు వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తోంది. నాణ్యత కూడా దెబ్బతింటోంది.

తిరస్కరణ ఇలా...

ఈ నెల 2 నుంచి 7వ తేదీ మార్కెట్‌కు వచ్చిన పొగాకు, తిరస్కరణకు గురైన బేళ్లను పరిశీలిస్తే... నల్లరేగడి నేలల్లో పండించిన 19,969 బేళ్లను రైతులు తీసుకు రాగా, 4,368 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. 15,701 బేళ్లను మాత్రమే కొన్నారు. తేలిక నేలల్లో పండించిన 21,226 బేళ్లను తీసుకురాగా, 4,829 బేళ్లను తిరస్కరించారు. 16,397 బేళ్లను మాత్రమే కొన్నారు. రోజుకు ఎనిమిది వేల బేళ్లను తిరస్కరిస్తున్నారు. వాటిల్లో 25 శాతం బేళ్లను వ్యాపారులు తిరస్కరించి వెనక్కి పంపుతున్నారు.

పోటీ లేకపోవడమే దోపిడీకి కారణం

వేలంలో వ్యాపారులు కొద్దిమందే పాల్గొంటున్నారు. అయినా, పొగాకు బోర్డు ప్రేక్షకపాత్ర వహిస్తోంది. ఈ ఏడాది 140 మిలియన్ కిలోల సాగుకు అనుమతిచ్చింది. వాతావరణం సానుకూలంగా లేకపోవడం, అకాల వర్షాల వల్ల దిగుబడి, కొంత నాణ్యత తగ్గింది. బోర్డు అనుమతి ఇచ్చిన మేరకు కూడా పంట వచ్చే పరిస్థితి లేదు. విదేశీ ఎగుమతులు లేవనే సాకుతో వ్యాపారులు ధరల్లో కోత పెడుతున్నారు. పోటీ లేకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని వ్యాపారుల సిండికేట్‌కు అడ్డుకట్ట వేయాలని, పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

గుండెపోటుతో ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఉయ్యూరు (కృష్ణా జిల్లా)

గుండెపోటుతో ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం బోళ్లపాడులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోళ్లపాడు గ్రామానికి చెందిన బాణావత్ వాలి నాయక్ (62) గ్రామ సమీపంలో ఉపాధి పనులకు వెళ్లారు. పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కిందపడిపోయారు. సహచర కార్మికులు వెంటనే ఉయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉయ్యూరు ఎంపిడిఒ జివిఎస్ వి శేషగిరిరావు ఘటనా స్థలానికి చేరుకొని వాలి నాయక్ భౌతికాయాన్ని సందర్శించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వపరంగా అందాల్సిన పరిహారం నిమిత్తం ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.



రాజధాని ప్రాంతం మల్కాపురం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజధానిలో పారిశుధ్య కార్మికుల నిరసన

- ఉద్యోగ భద్రత, వేతనాలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు శుక్రవారం తుళ్లూరు మండలం మల్కాపురం సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు బి లక్ష్మణరావు మాట్లాడుతూ వేతన చెల్లింపులో జాప్యం తగదని, నాలుగు నెలలుగా పెండింగ్ ఉన్న పిఎఫ్, ఇఎస్ఐలను పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టర్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పని చేసే కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని కోరారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు మారినప్పుడల్లా కార్మికులకు నెలల తరబడి జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐలు పెండింగ్‌లో ఉంటున్నాయని, దీంతో కార్మికులు నష్టపోతున్నారని తెలిపారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి కార్మికులందరినీ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకొని సిఆర్‌డిఎ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, గత ప్రభుత్వం రద్దు చేసిన అమరావతి సామాజిక పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విశేష సేవలందించిన నేదురుమల్లి

- నరహరిశెట్టి నర్సింహారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాలుగు చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించి ప్రజలకు విశేష సేవలందించిన మహనీయుడు నేదురుమల్లి జనార్ధనరెడ్డి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరిశెట్టి నర్సింహారావు కొనియాడారు. విజయవాడలోని పిసిసి కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో మాజీ సిఎం నేదురుమల్లి జనార్ధనరెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యసభలో, లోక్‌సభలో, శాసనసభలో, శాసనమండలిలో నాలుగు చట్ట సభలకు ప్రతినిధ్యం వహించిన ఏకైక రాజకీయవేత్తగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించి ప్రజలకు విశేష సేవలందించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పిసిసి, సిటీ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'సిందూర్'కు మద్దతుగా సచివాలయ ఉద్యోగుల ర్యాలీ



రాష్ట్ర సచివాలయంలో ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత త్రివిధ దళాల సారధ్యంలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంఘీభావంగా రాష్ట్ర సచివాలయంలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. భారత సైన్యం శౌర్యాన్ని స్మరించుకుంటూ, దేశభక్తిని చాటుతూ సచివాయం మొదటి భవనం నుండి ప్రధాన గేటు వరకూ ర్యాలీ చేశారు. 'జయహో ఆపరేషన్ సిందూర్, జై జవాన్, జై భారత్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పలువురు నాయకులు, ఉద్యోగులు ప్రసంగించారు. ఉగ్రవాదులను పూర్తిగా తుదిముట్టించేందుకు భారత త్రివిధ సైనిక దళాలు అహర్నిశలు పాటుపడుతున్న నేపధ్యంలో దేశం యావత్తూ వారి వెంట నిలుస్తుందని చెప్పారు. పాక్ కాల్పుల్లో అమరుడైన రాష్ట్రానికి చెందిన 'అగ్నివీర్ మురళీ నాయక్ అమర్ రహే' అంటూ ఉద్యోగులు పెద్దఎత్తున నినదించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ జంపని రామారావు, డిప్యూటీ సెక్రటరీ జివిఎస్ వరలక్ష్మి, ఎస్ఒ నాపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎటిఎంలు మూతపడవు : ఎస్‌బిఐ

న్యూఢిల్లీ : భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రికత్తల నేపథ్యంలో ఎటిఎంలు మూతపడతాయని సోషల్ మీడియాలో వస్తోన్న పుకార్లను నమ్మొద్దని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తెలిపింది. ఇతర ప్రముఖ బ్యాంక్‌ల సేవలు సంపూర్ణంగా పని చేస్తాయని పేర్కొంది. డిజిటల్ సేవలు సజావుగా పని చేస్తున్నాయని వెల్లడించింది. ధృవీకరించని సమాచారాన్ని నమ్మకూడదని సూచించింది.

గురుకులాలపై పెరిగిన విశ్వాసం

- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పరీక్షా ఫలితాల విడుదల అనంతరం మాట్లాడుతున్న మంత్రి డోలా

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని గురుకులాలపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం పెరిగిందని, ఈ మేరకు విద్యా సంస్థల్లో అత్యుత్తమ బోధన అందేలా చర్యలు తీసుకుంటామని ఆ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ కార్యాలయంలో బిఆర్ అంబేద్కర్ గురుకులం ఇంటర్మీడియల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (బిఆర్ఎజిసిఇటి) 2025 పరీక్షా ఫలితాలను మంత్రి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు అధిక సంఖ్యలో విద్యార్థులు పోటీ పడటం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో గురుకులాల్లో సీటు పెంచాలని ఇప్పటికే సిఎం ఆదేశించారని, ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గురుకులాల్లో వచ్చే విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ ఏడాది 13న పరీక్ష నిర్వహించామని, 5వ తరగతిలో 15,020 సీట్లు అందుబాటులో ఉండగా, 39,281 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంటర్ మొదటి ఏడాదిలో 13,680 సీట్లు ఉండగా, 40,792 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షలో కర్నూలు జిల్లాకు చెందిన కడవల సుమతి 49 మార్కులతో, అనకాపల్లి జిల్లాకు చెందిన వియ్యపు శరత్ 48 మార్కులతో, కర్నూలు జిల్లాకు చెందిన బోయా విద్యా 48 మార్కులతో మొదటి మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశ పరీక్షలో విశాఖపట్నం జిల్లాకు చెందిన రఘుపతి గీతిక 92.50 మార్కులతో, కర్నూలు జిల్లాకు చెందిన ఈపూరు సుహృతి 91.25, పిజరి హసీనా 90.50 మార్కులతో మొదటి మూడు స్థానాలు సాధించారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మంత్రి అభినందించారు. గురుకులాల్లో విద్యార్థులకు నిలిపివేసిన కాస్మోటిక్ కిట్లను అందిస్తామన్నారు. పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, ట్రంకు పెట్టే, ప్లేట్, గ్లాస్, దుప్పట్లు, కార్పెట్, స్టేషనరీ తదితరాలను అందిస్తామన్నారు. విద్యార్థులకు వైద్య, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సాయం అందించేందుకు రూ.5 కోట్ల నిధి ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్, అదనపు కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



బర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

- ప్రభుత్వమే రూ.100 కోట్లు కేటాయించాలని ధర్నా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు (ప్రకాశం జిల్లా)

బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని కోరుతూ శుక్రవారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో రైతులు ధర్నా చేశారు. రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె జయంతిబాబు, పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రైతులను అనేక ప్రయివేట్ కంపెనీలు ప్రోత్సహించి బర్లీ పొగాకు సాగు చేయించాయని, దిగుబడి వచ్చాక కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం కూడా కంపెనీలతో కొనుగోలు చేయించడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి రూ.వంద కోట్లు కేటాయించి రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీకాంత్, జి బసవపున్నయ్య, కాకాని సుబ్బారావు, పాలపర్తి యోనా, హజరత్తయ్య, మండవ ఆంజనేయులు, వివిధ గ్రామాల బర్లీ పొగాకు రైతులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఆందోళనలో మానవాభివృద్ధి

ప్రపంచ మానవాభివృద్ధి ప్రగతి గడచిన మూడున్నర దశాబ్దాల్లో అత్యంత తక్కువ నమోదు కావడం పట్ల ఐక్యరాజ్య సమితి చీఫ్ అంటానియో గుటెరస్ వ్యక్తపర్చిన ఆందోళన మానవాళికి హెచ్చరిక. కరోనా మహమ్మారితో పూర్తిగా రెండు సంవత్సరాలు ఆర్థిక వ్యవస్థ స్తంభించిన అనంతరం మానవాభివృద్ధిలో సుస్థిరత నెలకొని మరింత మెరుగుదల దిశగా పయనించాల్సింది పోయి అధమ స్థాయికి దిగజారడం ఆత్మవిమర్శనాపూర్వకంగా ఆలోచించాల్సిన విషయం. 2024 సంవత్సరానికి ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) ప్రపంచ మానవాభివృద్ధి నివేదికను మంగళవారం వెలువరించింది. కృత్రిమ మేధ యుగంలో ప్రజలు, అవకాశాలపై నివేదిక విశ్లేషించింది. మానవాభివృద్ధి ప్రగతి నిర్ణయించుకున్న లక్ష్యాలకనుగుణంగా లేదు. మానవాభివృద్ధి తక్కువ ఉన్న దేశాలు, ఎక్కువ ఉన్న దేశాల మధ్య అసమానతలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని నివేదిక కుండబద్దలు కొట్టింది. ఈ అసమానతలు వరుసగా నాల్గవ తడవ కూడా మరింతగా విస్తరించడం ఆందోళన కలిగించే విషయం. ఆర్థిక, పర్యావరణ షాక్‌లు మానవాభివృద్ధికి తప్పవని, వాణిజ్య ఉగ్రవాదం పర్యవసానాలూ వెంటాడుతున్నాయని, రుణ సంక్షోభం, నిరుద్యోగిత పెరుగుతాయని క్లిష్టతర భవిష్యత్‌ను ఆవిష్కరించింది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఎఐ)కు హ్యూమన్ ఫేస్ ఉండాలన్న హితబోధ జాగరూకతను సూచిస్తుంది. విద్య, ఆరోగ్య రంగాలను ఆధునీకరించాలన్న సిఫారసు తక్షణం కార్యాచరణలో పెట్టాల్సి ఉంది.

మానవాభివృద్ధి సూచిలో భారతదేశం ర్యాంక్ గతం కంటే స్వల్పంగా మెరుగుపడినా ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష సవాళ్లను సృష్టిస్తూనే ఉన్నాయని యుఎన్‌డిపి నివేదికతో తెలుస్తుంది. 193 దేశాల్లో మన దేశం స్థానం 130. అదే 2022లో మన ర్యాంక్ 133. సుదీర్ఘ, ఆరోగ్యకర జీవితం, జ్ఞానాన్ని సంపాదించడం, మంచి జీవన ప్రమాణం.. ఈ మూడు ప్రధాన అంశాల్లో మన దేశం బలంగా ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఉపాధి హామీ, విద్యాహక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ వంటి కార్యక్రమాలు మానవాభివృద్ధి ప్రగతికి కొంత వరకు పని చేశాయని చెప్పవచ్చు. కాగా సమాజంలో ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో శత కోటీశ్వరుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని ఫోర్బ్స్ సహా పలు అంతర్జాతీయ సంస్థలు ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నాయి. వాటికి అభిముఖంగా దిగజారుతున్న పేదరికం వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి తరుగుదల, పారిశ్రామిక మందగమనం, ఉపాధి అవకాశాల తగ్గుదల, పోషకాహార లోపం, పాఠశాలల్లో డ్రాపవుట్స్, బాలకార్మిక సమస్యలు పీడిస్తున్నాయి. ప్రపంచ ఆకలి సూచిలో ఇండియా స్థానం చిట్టచివరిలో ఊగిసలాట అసమానతల తీవ్రతకు ప్రతిరూపం.

2023-24లో మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం 41.71 శాతానికి పెరిగిందని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వేలో ఉటంకించబడింది. మహిళాశక్తి సద్వినియోగం కావాలంటే మహిళలు ఉద్యోగాల్లో చేరే వాతావరణం నెలకొల్పబడాలి. వారు తమ ఉద్యోగాలను నిలుపుకునే అవకాశాలు సృష్టించబడాలి. ప్రస్తుతం ఆ పరిస్థితులు తక్కువేనన్నది నిపుణుల మాట. రాజకీయ భాగస్వామ్యంలో మహిళల వెనుకబాటు కొనసాగుతోంది. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియకుండా ఉంది. ఈ పరిస్థితుల్లో మార్పు రాకుండా మానవాభివృద్ధి పెరగదన్నది కఠోర నిజం. ఆదాయ, లింగ అసమానతలు భారతదేశ మానవాభివృద్ధి ప్రగతిని 30.7 శాతం తగ్గించాయి. ఎ.ఐ., అభివృద్ధి పరిమితులపై మానవాభివృద్ధి ఆధారపడి ఉంది. ఎ.ఐ. విషయంలో 2019లో సున్నా స్థానంలో ఉన్న ఇండియా పరిశోధకులను నిలుపుకుంది. అభివృద్ధి వైపు అడుగులేస్తోంది. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ప్రజా సేవల డెలివరీలో ఎ.ఐ.ని ఉపయోగించాలి. కానీ ఎ.ఐ. ఇప్పటికే నెలకొని ఉన్న అసమానతలను తీవ్రతరం చేసే ప్రమాదాన్ని నివారించే సరైన విధానం, రక్షణ చర్యలు అత్యవసరం. యుఎన్‌డిపి నివేదిక సారాంశం ఇదే!

మంచి మాట



ప్రకృతి రహస్యాలను
వివరించలేనిది శాస్త్రం కాదు!
జీవితంలోని కష్టాలను తీర్చలేనిది
ఆవిష్కరణ కాదు!
జీవితంలోని ప్రతి కోణాన్ని
చూపలేనిది సాహిత్యమే కాదు!
- కొడవటిగంటి కుటుంబరావు,
ప్రసిద్ధ కథా రచయిత.

విద్వేష ప్రచారం విభజన కుట్రలకే ఊతం

వ్యాఖ్య

పహల్గాంలో పర్యాటకుల అమానుష హత్యాకాండపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు కొనసాగుతున్నాయి. కంప్యూటర్ మోనిటర్లపైన, స్మార్ట్‌ఫోన్ల తెరలపైన కనిపించే చిత్రాలతో ఘటనలను కథనం చేసే ప్రస్తుత కాలంలో ఈ ఘోరమైన సన్నివేశాన్ని గురించి ఎవరైనా ఇంకేం ఆశించగలుగుతారు? వారిలో మృతులను మతపరంగా నిర్ధారించుకొని మరీ ప్రాణాలు తీసినట్టు తెలిసి రావడంతో ఈ బాధ మరింత తీవ్రమవుతున్నది. అలాంటి ఘాతుక చర్య ఆలోచనా శక్తిగల వారిని కదిలించకుండా ఉండదు. ఇందుకు కారకులైన నేరస్తులను ఎంత తీవ్రంగా ఖండించినా తక్కువ అవుతుంది.

అయితే ఈ రోజున ఈ ఘాతుకానికి పాల్పడిన వారి పట్ల, వారిని నడిపించే వారి పట్ల ఒక జాతిగా, దేశంగా, ప్రజానీకంగా సమైక్యంగా ఎలా స్పందించాలన్నది మన ముందున్న సవాలు. ఇది కచ్చితంగా అవసరమైనది. ఆ పని జరిగేలా చూడడం కోసమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటైంది. ఆ సమావేశం ముక్త కంఠంతో ఈ ఘాతకాన్ని ఖండించటమే కాక నేరస్తులను పట్టుకోవడంలో సహకరించాలని తీర్మానించింది. ఈ క్లిష్ట సమయంలో చర్య తీసుకోవడానికి అసాధారణమైన రీతిలో అంత విస్తృత ప్రాతిపదికన ఆమోదం తెలపడం అంటేనే ఈ సవాలు తీవ్రత ఎంతో తెలుస్తుంది.

చేయకూడనిదేంటి?

ఈ సమయంలో చేయవలసింది ఏమిటి, చేయకూడనిది ఏమిటి అన్నది తక్షణం నిర్ణయించుకోవాల్సిన అంశం. ఏం చేయాలన్నది ప్రభుత్వం మాత్రమే నిర్ణయించగలుగుతుంది. అయితే విభిన్నతతో కూడిన ప్రజలుగా మనం ఏం చేయకూడదో కూడా ఏకశిలా సదృశ్యమైన ఐక్యతతో నిర్ణయించుకోవాలి. ఇప్పుడు, బహుశా ఎప్పుడూ...టెర్రరిస్టులు భారతీయుల వైవిధ్యాన్ని దెబ్బకొట్టదగిన ఒక బలహీనతగా పరిగణించి దాడులు గురిపెడుతుంటారు. కనుక బైసరన్‌లో మృతులను మతాన్ని బట్టి ఎంపిక చేయడం వెనుక ఉన్న దుష్ట కుట్ర అర్థం అవుతుంది. తద్వారా ప్రజలను మతపరంగా విభజించాలనే టెర్రరిస్టు నేరస్తుల కుటిల పన్నాగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మనం సాగినవ్వరాదు.

ఈ సమయంలో చేయవలసింది ఏమిటి, చేయకూడనిది ఏమిటి అన్నది తక్షణ నిర్ణయించుకోవాల్సిన అంశం. ఏం చేయాలన్నది ప్రభుత్వం మాత్రమే నిర్ణయించగలుగుతుంది. అయితే విభిన్నతతో కూడిన ప్రజలుగా మనం ఏం చేయకూడదో కూడా ఏకశిలా సదృశ్యమైన ఐక్యతతో నిర్ణయించుకోవాలి. ఇప్పుడు, బహుశా ఎప్పుడూ... టెర్రరిస్టులు భారతీయుల వైవిధ్యాన్ని దెబ్బకొట్టదగిన ఒక బలహీనతగా పరిగణించి దాడులు గురిపెడుతుంటారు. కనుక బైసరన్‌లో మృతులను మతాన్ని బట్టి ఎంపిక చేయడం వెనుక ఉన్న దుష్ట కుట్ర అర్థం అవుతుంది. తద్వారా ప్రజలను మతపరంగా విభజించాలనే టెర్రరిస్టు నేరస్తుల కుటిల పన్నాగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మనం సాగినవ్వరాదు.



అయితే కచ్చితంగా ఈ విషయంలోనే ప్రజలమైన మనం హిందుత్వ ప్రచారాలకు లోబడిపోయే అవకాశం వుంటుంది. రాజకీయ సైద్ధాంతిక ఆధిక్యత కోసం ఇలాంటి మత సమీకరణాన్ని అంచుల దాకా తీసుకుపోవడం ఆ ప్రచారం లక్ష్యం. ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోవడానికి ప్రధాన స్రవంతి కార్పొరేట్ మీడియాను సాధనంగా చేసుకుంటారు. ఎందుకంటే అది ఎప్పుడూ పాలక వ్యవస్థల పట్ల మొగ్గు చూపుతుంది.

సోషల్ మీడియాలో విష ప్రచారం

అయితే విజ్ఞతకు, సుస్థిరతకు అసలైన ముప్పు సోషల్ మీడియాలో విషపూరిత కోణాల నుంచి ఉత్పన్నమవుతోంది. ఈ విచ్ఛిన్నత ప్రాణాంతక స్వభావం సంతరించుకోవడానికి కారణం కూడా ఉంది. హిందూత్వ శక్తులు, వారి సమాచార విభాగం ఐటీ సెల్ ఆధ్వర్యంలో విద్వేష పూరితమైన కట్టుకథలు వదలడానికి ఒక యంత్రాంగం ఏర్పాటు చేశారు. కొంతకాలం కిందట అమిత్ షా మాట్లాడుతూ తాము 32 లక్షల వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేశామని, వాటి ద్వారా ఏ విషయమైనా గంట లోపలే దేశమంతా వైరల్ చేయగలమని ప్రకటించారు.

దీని ఫలితాలు అందరికీ కనిపిస్తూనే ఉన్నాయి. ఆన్‌లైన్‌లో అసత్య ప్రచారాల విద్వేష ప్రభావంపై యునెస్కో ఇప్‌సాస్ నిర్వహించిన సర్వే ఈ వాస్తవాన్ని వెల్లడించింది. భారతదేశంలో ఆ సర్వేకు స్పందించిన 64 శాతం మంది అసత్య కథన వార్తలు, విద్వేషాలు వ్యాప్తిలో సోషల్ మీడియాదే ప్రధాన నేరస్థ పాత్ర అని చెప్పారు. దురదృష్టవశాత్తు భారతీయ పట్టణ వాసుల్లో ప్రతి ఇద్దరిలో ఒకరు (56 శాతం) వార్తలు, కథనాలు తెలుసుకోవడానికి తాము సోషల్ మీడియా సమాచారంపైనే ఆధారపడతామని కూడా చెప్పారు. పహల్గాం దారుణ ఘటన తర్వాత సాధారణంగా కాశ్మీరీలు, ప్రత్యేకించి ముస్లింలు లక్ష్యంగా సోషల్ మీడియాలో విద్వేష ప్రచారం పొంగిపొర్లింది.

కాశ్మీరీల సంఘీభావం

క్షేత్రస్థాయి వాస్తవాలు వేరుగా ఉన్నప్పటికీ ఇలా జరగడం గమనించదగింది. మృతులు, బాధితుల పట్ల సంఘీభావం తెల్పడంలో కాశ్మీరీలు అగ్ర భాగాన నిలబడ్డారు. కాశ్మీరీ ముస్లిం పోనీ అశ్వికుడు టెర్రరిస్టుల నుంచి తుపాకీ లాక్కుని ఎదురు దెబ్బ తీయబోగా తనపై తూటాల వర్షం కురిపించి ప్రాణాలు తీశారు. పర్యాటక రంగంతో ముడిపడిన డ్రైవర్లు, ఇతర స్థానికులు సౌకర్యార్థం ఆహారం నుంచి వసతి సదుపాయం వరకు సమస్తమూ సమకూర్చారు. టెర్రరిస్ట్ ఘాతుకాన్ని ఖండిస్తూ కశ్మీర్ లోయలో పట్టణాలు, నగరాలన్నిటా పూర్తి బంద్ పాటించి దుకాణాలన్నీ మూసివేశారు. దానివల్ల తమ ఉపాధి పోతుందని తెలిసినా తక్కిన దేశంతో పాటు వారు ఆ విధంగా చేయడం అపూర్వమైన చర్య. మూలాల నుంచి వ్యక్తమైన ఈ ప్రజా కార్యాచరణను మరింత ప్రతిబింబిస్తూ జమ్ము కాశ్మీర్ శాసనసభ అసాధారణమైన మానవతతో సంఘీభావం వెల్లడించింది.

గుండెలు పిండే కథ

అయితే పహల్గాం పచ్చిక బైళ్లలో జరిగిన ఈ హత్యాకాండలో నౌకా దళాధికారి అయిన తన భర్తను కోల్పోయిన హిమాన్షి నర్వాల్‌పై అత్యంత విషపూరితంగా సైబర్ దాడి సాగించటం అన్నిటిని మించి మనసును కలచివేస్తుంది. మనం ఎంత ప్రమాదకరమైన అగాధపు లోతుల్లో దిగబడి పోయామో ఆమె హృదయ విదారక స్థితిని బట్టి తెలుస్తుంది. తన భర్త మృతదేహాన్ని ఒళ్ళో పెట్టుకున్న హిమాన్షి శోక తప్త వదనమే ఈ విషాదం తీవ్రతను, నేరం అమానుషత్వాన్ని చెప్పేలా వైరల్ కావడం మరింత విపరీతం. అయినా ఆమె అంత విషపూరితమైన దాడులకు ఎందుకు గురికావాల్సి వచ్చిందంటే ఆమె అచంచలంగా ఇచ్చిన జవాబే కారణం. "ముస్లింలకు, కాశ్మీరీలకు వ్యతిరేకంగా ప్రజలు దాడి చేయాలని మేము కోరుకోవడం లేదు. మాకు న్యాయం మాత్రం కావాలి" అని ఆమె అనడం, విద్వేష వర్గాలతో గొంతు కలపడానికి నిరాకరించడం వారు భరించలేక పోయారన్నమాట.

మానవత్వం లేని ద్వేషపూరితమైన ఈ ప్రవర్తనను హిందుత్వ అగ్ర పీఠాధిపతులు ఖండించకుండా ప్రమాదకరమైన మౌనం పాటించారు. జాతీయ మహిళా కమిషన్ చాలా మొక్కుబడిగా ఒక ట్వీట్‌తో ఇది నైతికంగా సరైంది కాదని ప్రకటించింది గాని దీని వెనక ఉన్న సైద్ధాంతిక మూలాలను బయట పెట్టడం అటుంచి, ఈ అంతర్జాల పోకిరీలపై చట్టపరమైన శిక్ష, చర్యలకు కదలిక చూపలేదు. ఇది ఎంత మాత్రం ఆమోదం, ఆమోదయోగ్యం కాదు. ఈ వైఖరి టెర్రరిస్టుల పథకాల వలల్లో చిక్కుకోవడానికే దారితీస్తుంది.

/ మే 7 'పీపుల్స్ డెమోక్రసీ' సౌజన్యంతో/

పహల్గాం దాడి-భారత్ స్పందన

సంపాదకీయం

మే ఏడవ తేదీ అర్ధరాత్రి తర్వాత భారత సైనిక దళాలు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్ భూభాగంలోని తొమ్మిది టెర్రరిస్టు స్థావరాల విధ్వంసం లక్ష్యంగా సైనిక చర్య ప్రారంభించాయి. పహల్గాంలో భారతీయ పర్యాటకులను అమానుషంగా బలిగొన్న హత్యాకాండకు ప్రతిస్పందన అవసరమన్న దానిపై దేశంలో విభిన్న దృక్పథాలుగల అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం వుంది. భారత ప్రభుత్వం, సైనిక దళాల ప్రతినిధులు సమర్పించిన సాక్ష్యాధారాలు లష్కరే తోయిబా దీని వెనక వుందని నిరూపించాయి. లష్కరేను పాకిస్తాన్ పాలక వ్యవస్థ నేరుగా నడిపిస్తుంటుంది. ఐక్యరాజ్యసమితి ఇప్పటికే దాన్ని టెర్రరిస్టు సంస్థగా అధికారికంగా ప్రకటించింది.



పాకిస్తాన్ పాలక వ్యవస్థపై మరింతగా దౌత్యపరమైన రాజకీయమైన ఒత్తిడి తేవడానికి భారత దేశం మరింత విశ్వసనీయమైన సాక్ష్యాధారాలు పోగు చేయాలి. పహల్గాం ఘాతుకానికి కారకులైన వారిని బోనెక్కించాలి. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి టెర్రరిస్టు దాడులకు పాల్పడకుండా శిక్షలు పడేలా చూడాలి. అన్నిటినీ మించి ఇరు దేశాల ప్రజల సౌభాగ్యం కోసం, ప్రగతి కోసం శాంతి సుస్థిరతలు కాపాడబడాలి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

దేశంలో మతపరమైన విభజన రగిలించడానికే పహల్గాం దాడి జరిగిందని పత్రికా గోష్టిలో మాట్లాడిన విదేశాంగ కార్యదర్శి స్పష్టంగా పేర్కొన్నారు. అది నిజం. అలాంటప్పుడు భారత దేశపు ప్రధాన మీడియా, సోషల్ మీడియా ఈ కుట్రను గమనంలోకి తీసుకున్నాయా అనేది ప్రత్యక్షంగా కనిపిస్తూనే వుంది.

ఆ మీడియాలో విష ప్రచారం

మితవాద, మతవాద మీడియా సంస్థలలో అత్యధిక భాగం తమ పోస్టులలో, ప్రసారాలలో కాలకూట విషం కక్కుతున్న తీరు కూడా అందుకు ఏమీ తీసిపోయేలా లేదు. ఇంకా చెప్పాలంటే పహల్గాంలో టెర్రరిస్టు మారణకాండ సాగించిన వారిలాగే వీరు కూడా ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తుంది. కనుక కేవలం పైకి కనిపించడానికే గాక కచ్చితమైన చర్యలతో మనం ఈ మీడియావరణం వెదజల్లే విషానికి విరుగుడు తీసుకురావాలి. ఈ లక్ష్యం సాధించేందుకు భారత రాజ్యాంగంలో కావలసిన నిబంధనలున్నాయి.

మరింత జాగ్రత్త పడాలి

లక్ష్యాలను కచ్చితంగా నిర్దేశించుకుని పరిస్థితి మరింత ప్రజ్వలనకు దారితీయకుండా సైనిక చర్య జరిపినట్టు భారత పాలక వ్యవస్థ చెబుతున్నది. సమకాలీన ప్రపంచంలో ఒక పూర్తి స్థాయి సైనిక ఘర్షణ రాజకీయ భౌగోళిక ప్రభావాలు వినాశకరంగా వుంటాయనేది బాగా తెలిసిన విషయమే. కనుక మనం మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి వుంటుంది. ఎందుకంటే ఈ విధమైన చర్యలు ఒకదానికొకటిగా దారితీసి మరింత రగులుకొనే ప్రమాదం ఎప్పుడూ వుంటుంది. అందుకు ఎలాంటి అవకాశమివ్వకుండా జాగ్రత్త పడాలి. వాటి ఉనికి లేకుండా చేయడమే ఇక్కడ లక్ష్యంగా వుండాలి.

సాక్ష్యాధారాల సేకరణ

పాకిస్తాన్ పాలక వ్యవస్థపై మరింతగా దౌత్యపరమైన రాజకీయమైన ఒత్తిడి తేవడానికి భారత దేశం మరింత విశ్వసనీయమైన సాక్ష్యాధారాలు పోగు చేయాలి. పహల్గాం ఘాతుకానికి కారకులైన వారిని బోనెక్కించాలి. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి టెర్రరిస్టు దాడులకు పాల్పడకుండా శిక్షలు పడేలా చూడాలి.

శాంతి సుస్థిరత

అన్నిటినీ మించి ఇరు దేశాల ప్రజల సౌభాగ్యం కోసం, ప్రగతి కోసం శాంతి సుస్థిరతలు కాపాడబడాలి. భారత దేశం బహుళత్వంతో కూడిన సమాజం. భిన్నత్వంలో ఏకత్వం దాని అతి పెద్ద బలం. దాన్ని అలాగే నిలబెట్టుకోవాలి. మన ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసే చర్యలకు అసలు ఆస్కారం ఇవ్వరాదు. అస్తిత్వం ప్రాతిపదికన విద్వేషం పెంచే ధోరణులను అడ్డుకోవాలి.

జనవాక్యం

మోడీజీ...మరిచారా!

నరేంద్ర మోడీ మొదటిసారి అమరావతి ప్రారంభోత్సవానికి వచినప్పుడు చెంబుడు నీళ్ళ, గుప్పెడు మట్టి ఇచ్చి వెళ్లారు. ఏమీ ఇవ్వలేదే అనుకున్నాము. ఈసారి కనీసం అవి కూడా తీసుకురాలేదు. ప్రతిపక్షం వాళ్ళు చంద్రబాబు ప్రత్యేక హోదా ఎందుకు అడగలేదని అంటున్నారు. దానికి ఎవ్వరూ నోరు మెదపరే! ఆయన కూడా ఏదో మీట నొక్కి వెళ్ళారు. రూ. 58 వేల కోట్లు అన్నారు. ఇంతకీ అవి అప్పా, ఉచితమా! అప్పుగానే అని వినిపిస్తోంది. అసలు సంగతి...మోడీ గారు మొదటిసారి ప్రధానమంత్రిగా గద్దె ఎక్కేటప్పుడు దేశంలోని ప్రతి ఒక్కరికి 15 లక్షల రూపాయలు జమ వేస్తాను అన్నారు. అది ఏమైందో ఆయన మరలా చెప్పలేదు. కానీ ప్రజలు మరువలేదు. పోస్టుమ్యాన్ వచ్చినపుడల్లా రూ.15 లక్షలు గుర్తుకొస్తాయి. కవరు వస్తుందేమో అని. బ్యాంకుకు వెళ్లినప్పుడల్లా ఖాతా ఆ డబ్బు పడిందేమోనని అడిగి చూసుకోవడం! ఒక్క పైసా కూడా జమ కాలేదని తెలుసుకుని నిట్టూర్చడం పరిపాటి అయ్యింది. ఒకసారి నాకు ప్రధానమంత్రి కార్యాలయం నుండి ఒక కవరు వస్తే, రూ.15 లక్షల కవరేమో అనుకొని సంతోషపడుతూ చించి చూస్తే అది వేరే కవరు. మోడీజీ...మీ సొంత పైకం ఇవ్వమనటంలేదు. విదేశాలలో మనవాళ్ళ దాచిపెట్టిన నల్లధనాన్ని, బయటకి తీసి ఇస్తామన్నారు. మరచి పోయారేమో! మరల గుర్తు చేసుకొని, మాట నిలుపుకోండి మోడీజీ. మీ నుండి ప్రజలు కోరుకునే వాటిలో ఇదీ ఒకటి.

– నార్నె వెంకట సుబ్బయ్య.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

అరుదైన గొప్ప సినిమా 'ఫూలే'

సమీక్ష



ఎస్. వినయ కుమార్

'ఫూలే' అరుదైన గొప్ప చిత్రం. సెన్సార్ వారు మోకాలడ్డినా, పరిమిత థియేటర్లు లభించినా ఆ సినిమా విజయ యాత్రను అడ్డుకోవడం అసాధ్యం. చరిత్రను కలుషితం చేసే, వక్రీకరించే సినిమాల పరంపర సాగుతున్న దశలో 'ఫూలే' గొప్ప ఉపశమనం. కాచిగూడ చౌరస్తాలోని ఐనాక్స్‌లో సినిమా చూసినప్పుడు నాకు ఒక సంతోషదాయక అనుభవం ఎదురైంది. సినిమా ముగిసి దర్శకుడు అనంత్ మహదేవన్ పేరు తెరపై కనబడగానే ప్రేక్షకులు చప్పట్లు చరిచారు. స్టేజీ మీద ఒక నృత్యాన్ని చక్కగా ప్రదర్శించినప్పుడు, మంచి నాటకానికీ ప్రేక్షకులు చప్పట్లు కొడతారు. అక్కడ ప్రేక్షకులు, కళాకారులతో ప్రత్యక్ష సంబంధంలో ఉంటారు. అలాగే సినిమాల్లో హత్తుకొనే డైలాగులకు, హీరో ప్రవేశానికి, అతని స్టంట్లకు చప్పట్లు కొట్టొచ్చు. కాని అలాంటి అరుదైన స్పందనకు కారణం పూలే దంపతుల పోరాటం. ఆ పోరాటాన్ని చక్కగా తెరకెక్కించింది అనంత్ మహదేవన్, ఆయన టీమ్.

'మహాత్మా పూలే' పేర 1954లో మరాఠీలో ఒక బ్లాక్ అండ్ వైట్ చిత్రం విడుదలైంది. దాన్ని హిందీలోకి కూడా డబ్ చేశారు. మరాఠీ సినిమా 'మహాత్మా పూలే కు' నేటి 'పూలే' చిత్రానికి ఒక తేడా కన్పిస్తుంది. సినిమా పేరుతోనే ఆ తేడా స్ఫురిస్తుంది. మరాఠీ చిత్రంలో జోతిరావుది ప్రధాన పాత్ర. నేటి 'పూలే' చిత్రంలో దంపతులిద్దరిదీ సమాన భాగస్వామ్యం. నిజానికి సావిత్రిబాయికి రవ్వంత ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. ఈ సినిమా మొదటి సీన్ సావిత్రిబాయితో ప్రారంభమవుతుంది. ఆమె మృతితో సినిమా ముగుస్తుంది. పూలే దంపతులు స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. అనంత్ మహదేవన్ స్త్రీ విద్య పట్ల పూలే దంపతుల దృఢ నిశ్చయాన్ని, తెగువను చక్కగా చూపారు. జోతిరావు పూలే 1890లో మరణించారు. దానికి ముందే పక్షవాతం వల్ల ఆయన కుడి కాలు, కుడి చేయి చచ్చుబడ్డాయి. ఆ దశ నుండి తాను చనిపోయే దాక సావిత్రిబాయి సత్యశోధక్ సమాజ్ బాధ్యతలను చేపట్టారు. 1897 మార్చి 10న సావిత్రిబాయి చనిపోయారు.

19వ శతాబ్దంలో మహిళలు ఇంటి నుండి బయటికి అడుగు పెట్టడమే పాపంగా భావించే వారు. ఆరోజుల్లో సావిత్రిబాయి, ఆమె స్నేహితురాలు ఫాతిమా చూపిన ధైర్యం అసమానం. మహిళల అణిచివేత హిందువుల్లోనే కాదు, ముస్లింలలో కూడా ఉందని, మత పెద్దలు ఆచరణలో ఖురాన్ బోధనలను వక్రీకరిస్తున్నారని చూపెట్టడంలో దర్శకుడు మెలుకువ చూపాడు. పూలే దంపతులు స్త్రీ విద్య కోసం వెలిగించిన కాగడా దేశమంతటా వెలుతురు పరిచింది. ఆ పాయింట్ మీద సినిమా ముగుస్తుంది.

ఈ సినిమా మొదటి సీన్ సావిత్రిబాయితో ప్రారంభం అవుతుంది. ఆమె మృతితో సినిమా ముగుస్తుంది. పూలే దంపతులు స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. అనంత్ మహదేవన్ స్త్రీ విద్య పట్ల పూలే దంపతుల దృఢ నిశ్చయాన్ని, తెగువను చక్కగా చూపారు. జోతిరావు పూలే 1890లో మరణించారు. దానికి ముందే పక్షవాతం వల్ల ఆయన కుడి కాలు, కుడి చేయి చచ్చుబడ్డాయి. ఆ దశ నుండి తాను చనిపోయే దాక సావిత్రిబాయి సత్యశోధక్ సమాజ్ బాధ్యతలను చేపట్టారు. 1897 మార్చి 10న సావిత్రిబాయి చనిపోయారు. 19వ శతాబ్దంలో మహిళలు ఇంటి నుండి బయటికి అడుగు పెట్టడమే పాపంగా భావించే వారు. ఆ రోజుల్లో సావిత్రిబాయి, ఆమె స్నేహితురాలు ఫాతిమా చూపిన ధైర్యం అసమానం. మహిళల అణిచివేత హిందువుల్లోనే కాదు, ముస్లింలలో కూడా ఉందని, మత పెద్దలు ఆచరణలో ఖురాన్ బోధనలను వక్రీకరిస్తున్నారని చూపెట్టడంలో దర్శకుడు మెలుకువ చూపాడు. పూలే దంపతులు స్త్రీ విద్య కోసం వెలిగించిన కాగడా దేశమంతటా వెలుతురు పరిచింది. ఆ పాయింట్ మీద సినిమా ముగుస్తుంది.



వెలుతురు పరిచింది. ఆ పాయింట్ మీద సినిమా ముగుస్తుంది.

పూలే స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామి కాలేదన్న విమర్శకు కూడా దర్శకుడు తగిన విధంగా సమాధానం ఇచ్చాడు. విద్య విషయంలో సైతం బ్రిటిష్ పాలకుల చిత్తశుద్ధిపై పూలేకు పెద్ద నమ్మకం లేదు. వారు భారతదేశాన్ని దోచుకోవడానికి వచ్చారని సినిమాలో చాలాసార్లు పూలే చేత చెప్పించారు.

పూలేను నాస్తికుడని చెప్పలేము. అదే మాట సావిత్రిబాయి చేత చెప్పిస్తాడు దర్శకుడు. పూలే ఆంగ్లేయుల ఏజెంట్ అని, శూద్రులకు ఆంగ్ల భాష నేర్పించి సంస్కృతానికి ప్రమాదం తెచ్చిపెడుతున్నారని బ్రాహ్మణులు వాపోతారు. ఒక సన్నివేశంలో సావిత్రిబాయి ఎవరైనా డాక్టర్, ఇంజనీర్ కావాలంటే సంస్కృత భాషతో సాధ్యమౌతుందా అని ప్రశ్నిస్తుంది. జోతిబా సంస్కృత భాషను పరాయి భాషగా భావించాడు. తెలుగులో వ్యవహారిక భాషా ఉద్యమానికి ఆద్యుడు గిడుగు రామ్మూర్తి, కాగా మరాఠీలో ఆ పని ఆయన కంటే ముందే పూలే చేపట్టారు.

బ్రాహ్మణుడు లేకుండా జరిగే పెళ్లిపై బ్రాహ్మణులు భౌతిక దాడి చేస్తారు. కోర్టుకు ఎక్కుతారు. హిందూ ధర్మ శాస్త్రాలకు భిన్నంగా జరిగే పెళ్లి పెళ్లే కాదని వాదిస్తారు. చివరికి అలాంటి పెళ్లిళ్ల వల్ల తమకు చేరాల్సిన డబ్బు చేరడం లేదని, సాంప్రదాయం ప్రకారం ఆ డబ్బునయినా ఇప్పించమని న్యాయస్థానాన్ని అడుగుతారు. పూలే జోక్యం చేసుకొని పిటీషన్‌దారు న్యాయవాదిని "మీరు రోజూ గడ్డం చేసుకుంటారు. గడ్డం మీరే చేసుకున్నారు సరే, ఆ డబ్బు సాంప్రదాయం ప్రకారం క్షురకులకు ఇస్తున్నారా?" అని ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్న విన్న న్యాయమూర్తి కేసు కొట్టేస్తాడు.

రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చిన వారిని ఇప్పుడు దళితులు అని అంటున్నారు. పూలే తన రచనల్లో శూద్రులు, అతిశూద్రులు అన్నారు. సినిమాలో మాత్రం సావిత్రిబాయి సోదరులందరూ దళితులే అని అన్నట్లు చెప్పారు.

అంబేద్కర్ అనుయాయులమని చెప్పుకునేవారు తరచూ ఒక గందరగోళాన్ని ప్రదర్శిస్తుంటారు. అంబేద్కర్‌ను దళితుల నాయకుడిగా, పూలేను వెనుకబడిన కులాల నాయకుడిగా చూపెడ్తారు. అది వాస్తవ విరుద్ధ భావన. పూలే సామాజిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. దళితులు, ఇతర వెనుకబడిన వర్గాలు వేర్వేరు అన్న భావన ఆయన రచనల్లో, ఉద్యమంలో కనిపించదు. సినిమాలోనూ ఆ జాగ్రత్త తీసుకున్నారు.

మానవ హక్కుల కోసం పూలే దంపతులు చేసిన పోరాటాన్ని సంభాషణ రూపంలో సినిమాలో చక్కగా చూపెట్టారు. ఫ్రెంచి విప్లవం, అమెరికాలో లింకన్ బానిస విధానాన్ని రద్దు చేయడం వంటి ప్రస్తావనలు తెచ్చారు. అలాంటి పోరాటాలు చేసి విజయం సాధించిన వివిధ దేశాల ఉద్యమాలను ప్రస్తావిస్తారు. ప్రపంచ ఉద్యమాలపై అవగాహనలో సావిత్రిబాయి వెనుకబడలేదని చూపెడ్తారు. పూలేపై ప్రముఖ జీవిత చరిత్రల రచయిత ధనంజయ కీర్ రాసిన పుస్తకంలోని అంశాలు కూడా సినిమాలో కనిపిస్తాయి. చారిత్రక ఇతివృత్తాలను, జీవిత చరిత్రలను సినిమాగా తీస్తున్నప్పుడు భావోద్వేగ సన్నివేశాలను సృష్టించడం పరిపాటి. అయితే అవి మూల కథను దెబ్బతీసేవి కారాదు. ఆ విషయంలో దర్శకుడు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఈ సినిమా గురించి సాధారణ ప్రేక్షకుడికి చెప్తే నటీనటులు ఎవరు? హీరో ఎవరు? హీరోయిన్ ఎవరు? అని అడుగుతున్నారు. ఈ సినిమాలో గోవిందరావు పూలే పాత్రను మినహాయిస్తే పాపులర్ నటీనటులు ఎవరూ లేరు. రూ.వందల కోట్లు హీరోకు పారితోషకంగా చెల్లిస్తే ఇక సినిమాకు మిగిలేదేముంది! మట్టి తప్ప. కథా బలం లేకుండా టెక్నాలజీతో చేయగల జిమ్మిక్కులపై ఆధారపడిన, తీసిన బరువైన హీరోల సినిమాలు కూడా బాక్సాఫీస్ దగ్గర నేడు చతికిలబడుతున్నాయి. బడా కార్పొరేట్ కంపెనీలు ఈ రోజుల్లో సినిమాలు నిర్మిస్తున్నాయి, ప్రదర్శిస్తున్నాయి. ఆ సినిమాలకు ఆశించిన లాభాలు రాకపోయినా ప్రజలను నిద్రపుచ్చడంలో, మతపర భావోద్వేగాలు రెచ్చగొట్టడంలో మాత్రం అలాంటి సినిమాలు చాప కింద నీరు లాంటి పాత్ర పోషిస్తున్నాయి. కార్పొరేట్లకు అంతకంటే కావాల్సింది ఏముంది? సినిమా ముగింపులో భారతీయులు భావోద్వేగాలకు ఎంతగా లోనవుతారో జోతిబా చేత చెప్పించారు. ఈ దేశంలో కులం, మతం పేరుతో జనాన్ని రెచ్చగొట్టడం చాలా సులభం. ఆ పనే ఇప్పుడు జరుగుతున్నది. భవిష్యత్ లోనూ జరుగుతుంది-అంటూ జోతిబా చెప్పినప్పుడు కూడా థియేటర్‌లో కాసిన్ని చప్పట్లయినా వినిపించడం శుభసూచకం, ఆశావహం.

/ రచయిత 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు,
సెల్ : 9989718311 /

దేశవ్యాప్తంగా సిఎ పరీక్షలు వాయిదా : ఐసిఎఐ

న్యూఢిల్లీ : భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత తీవ్రతరమవుతున్న వేళ ... దేశవ్యాప్తంగా సిఎ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) శుక్రవారం ప్రకటించింది. ఈ నెల 9వ తారీఖు నుంచి 14 వరకు ఈ పరీక్షలు జరగాల్సి ఉంది. సిఎకు సంబంధించి ఫైనల్, ఇంటర్మీడియట్, పోస్ట్ క్వాలిఫికేషన్ కోర్సు పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. తిరిగి పరీక్షలను నిర్వహించేది ఎప్పుడో త్వరలోనే వెల్లడిస్తామని స్పష్టం చేసింది. మరోవైపు రానున్న 3 రోజుల పాటు విద్యా సంస్థలన్ని మూసివేస్తున్నట్టు పంజాబ్ ప్రభుత్వం ప్రకటించింది. సరిహద్దులో ఉన్న జమ్మూ కాశ్మీర్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు.. సెలవులు లేకుండా ఆదేశాలు జారీ చేసింది.

రిజర్వాయర్‌లో కూలిన సైనిక హెలికాప్టర్ .. ఐదుగురు మృతి

కొలంబో : శ్రీలంకలో శుక్రవారం ఒక సైనిక హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు మరణించినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సైన్యం, వైమానిక దళానికి చెందిన 12మందిని మిలటరీ పెరేడ్ కోసం తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వైమానిక ప్రతినిధి ఎరాండా గీగనాగే తెలిపారు. కొలంబోకు ఈశాన్యంగా 280 కిలోమీటర్ల దూరంలో ఉన్న మదురు ఓయాలోని రిజర్వాయర్‌లో కూలిపోయిందని అన్నారు. సైన్యాన్ని బయటకు తీసి, ఆస్పత్రికి తరలించామని అన్నారు. చికిత్స పొందుతూ ముగ్గురు ఆర్మీ, ఇద్దరు వైమానిక దళానికి చెందిన ఇద్దరు మరణించారని గీగనాగె పేర్కొన్నారు. హెలికాప్టర్ ప్రమాదానికి గల కారణం తెలియాల్సి వుంది.

బిజెపి ఎంపి నిషికాంత్ దూబేకి సుప్రీంకోర్టు మందలింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయవ్యవస్థపై బిజెపి ఎంపి నిషికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. దూబే వ్యాఖ్యలు 'చాలా బాధ్యతారహితమైనవి', "అవమానకరమైనవి' అని సుప్రీంకోర్టు తీవ్రంగా విమర్శించింది. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా "అంతర్యుద్ధానికి" కారణమని బిజెపి ఎంపి దూబే చేసిన వ్యాఖ్యలపై న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. అయితే దూబేపై కోర్టు ధిక్కార చర్యలు ప్రారంభించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. అయితే, ఇటువంటి హాస్యాస్పదమైన ప్రకటనలతో వాడిపోవడానికి కోర్టులు పువ్వుల వలె సున్నితంగా ఉండవని, తాము దృఢంగా అభిప్రాయపడుతున్నట్లు సిజెఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. న్యాయ వ్యవస్థపై దూబే చేసిన వ్యాఖ్యలకు మందలిస్తూ "ఇటువంటి అసంబద్ధ ప్రకటనల ద్వారా ప్రజల దృష్టిలో కోర్టులపై ఉన్న విశ్వాసం, విశ్వసనీయత దెబ్బతింటాయని మేము విశ్వసించం. అయినప్పటికీ అలా చేయాలనే కోరిక, ఉద్దేశపూర్వక ప్రయత్నం ఉందని సందేహం లేకుండా చెప్పవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది.

ప్రధాని షెహబాజ్ షరీఫ్ పిరికివాడు

- పాక్ ఎంపి తీవ్ర వ్యాఖ్యలు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ ప్రజలు, నేతలు, సైన్యం భారత్ దాడులతో బెంబేలెత్తుతున్న వేళ...పాకిస్తాన్ పార్లమెంట్ సభ్యుడే ఏకంగా ఆ దేశ ప్రధానిపై విపరీతమైన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ పిరికివాడు అని వ్యాఖ్యానించారు. ప్రధాని తీరే ఇలావుంటే భారత్‌పై ఏ విధంగా పోరాడగలమంటూ ఆయన వ్యాఖ్యానించారు. భారత దాడుల గురించి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ ఎంపి తహీర్ ఇక్బాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని షరీఫ్‌పై ఎంపి చేసిన ఈ వ్యాఖ్యలు వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. పాక్‌లోని పలు లక్ష్యాలపై భారత్ దాడులు చేసిన వెంటనే షరీఫ్ పత్రికా సమావేశంలో మాట్లాడారు. ఆయన ఆ సమావేశంలో వ్యవహరించిన తీరు చాలా పేలవంగా వుందంటూ కూడా పలువురు నెటిజన్లు ట్రోల్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న యు.వాసుకి

సామాజిక ఐక్యతే సమాజానికి రక్షణ

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు యు.వాసుకి
- మహిళ కార్మికులపై వివక్ష
- వేతనాల్లో వ్యత్యాసం
- ప్రారంభమైన మహిళా వ్యవసాయ, గ్రామీణ కార్మికుల అఖిల భారత మహాసభ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో మహిళ కార్మికుల పట్ల వివక్ష నెలకుందని, అందుకే వేతనాల్లో వ్యత్యాసం ఉందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు యు.వాసుకి తెలిపారు. సామాజిక ఐక్యతే సమాజానికి రక్షణ అని పేర్కొన్నారు. కేరళలోని మలప్పురం జిల్లా ఇఎస్ఎం అకాడమీలో రెండు రోజుల పాటు జరిగే అఖిల భారత మహిళా వ్యవసాయ, గ్రామీణ కార్మికుల మహాసభ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ సభకు ముందుగా ఎఐఎడబ్ల్యుయు రాజస్థాన్ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కార్యవర్గ సభ్యురాలు దుర్గా స్వామి జెండా ఆవిష్కరించగా, అనంతరం అమరుల స్మారక స్థంభానికి పుష్పాంజలి ఘటించి వీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎ. విజయరాఘవన్, బి. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభను సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు యు.వాసుకి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. దేశ ప్రజలు ఈ దాడిని ఐక్యంగా ఖండిస్తున్న తరుణంలో కొన్ని శక్తులు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల ఐక్యత అత్యంత కీలకమని, సామాజిక ఐక్యతే సమాజాన్ని రక్షించగలదని పేర్కొన్నారు. మహిళా వ్యవసాయ కార్మికుల కష్టనష్టాలను ఆవేదనతో ఆమె వివరించారు. ఉద్యోగం కోల్పోయే భయం, ఆర్థిక అసమానతలు, జెండర్ వేతన వ్యత్యాసం, గృహాల్లో వేతనం లేకుండా చేపట్టే పనికి గుర్తింపు లేకపోవడం, ఆధార్ ఆధారిత వేతన చెల్లింపుల్లో లోపాలు, ఆరోగ్య పరిరక్షణ లోపాలు, గర్భధారణ, ప్రసవ సమయంలో సరైన పింఛను లేదా వెన్నుదన్నుగా లేకపోవడం, ఇంకా తగిన వైద్య సేవలు అందని పరిస్థితులు వంటి అనేక సమస్యలను ఆమె ప్రస్తావించారు, చర్చించారు. మహిళలు శారీరకంగా వ్యవసాయ పనిలో పురుషులతో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ, సామాజికంగా అణచివేతను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ వంటి చట్టాల ద్వారా వామపక్షాలు పోరాడి సాధించిన సమాన వేతన హక్కు ప్రస్తావిస్తూ, అలాంటి చట్టాలను ప్రజా ఉద్యమాల ద్వారానే సాధించవచ్చునని తెలిపారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రోత్సహిస్తున్న కార్పొరేట్ అనుకూల మానువాది సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు కూడా సైద్ధాంతిక స్థాయిలో జరగాలన్నారు. "మేము పోరాడతాం-మేమే గెలుస్తాం!" అంటూ ఆమె పిలుపునిచ్చారు.

ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా కొమల కుమారి, బోన్యా టుడ్డు, బి. పద్మ, ఎస్. పూన్గోతై, సరితా శర్మా, దుర్గా స్వామి, జిషా శ్యామ్ వ్యవహరించారు. ఎస్. పూన్గోతై సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, సిపిఎం పొలిట్ బ్యూరో మాజీ సభ్యులు కొడియరి బాలకృష్ణన్, కేంద్ర కమిటీ మాజీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం, అంబికా ప్రసాద్ మిశ్రా, మధుసూదన్ రావు వంటి తదితర ప్రముఖుల మృతిపై సంతాపం తెలిపారు. అలాగే గృహ, లైంగిక, కుల, మత హింస బాధితులు, పహల్గాం ఉగ్రవాద దాడిలో మృతులకు, పాలస్తీనా ప్రజా పోరాటంలో ప్రాణాలు కోల్పోయినవారికి, ఉక్రెయిన్ యుద్ధంలో మరణించినవారికి నివాళులర్పించారు.

కొలిజియం సిఫార్సులను త్వరగా క్లియర్ చేయండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో న్యాయమూర్తుల నియామకాలపై కొలిజియం సిఫార్సులను త్వరగా క్లియర్ చేయాలని సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైకోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీల కారణంగా పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య పెరిగిపోతుండటం పట్ల సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయమూర్తుల నియామకాల కోసం సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను త్వరగా ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ధారించుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. బెయిల్ మంజూరు కోసం ఉద్దేశించిన ఒక సుమోటో కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వివిధ హైకోర్టుల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 7,24,192 క్రిమినల్ అప్పీళ్ల ఆందోళనకరమైన పరిస్థితి అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పెండింగ్ అనేక హైకోర్టుల్లో న్యాయమూర్తుల కొరతకు నేరుగా ముడిపడి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. సంక్షోభాన్ని నొక్కిచెప్పడానికి ధర్మాసనం వివరణాత్మక గణాంకాలను అందించింది. '2,72,000 క్రిమినల్ అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్న అలహాబాద్ హైకోర్టులో 160 మంది న్యాయమూర్తుల సంఖ్య ఉన్నప్పటికీ, కేవలం 79 మంది న్యాయమూర్తులతో పనిచేస్తున్నారు. ముంబాయి హైకోర్టులో 94 మంది న్యాయమూర్తులకు గానూ కేవలం 60 మంది న్యాయమూర్తులు ఉన్నారు. కోల్‌కతా హైకోర్టులో 72 పోస్టులు మంజూరు చేయగా, 44 మంది న్యాయమూర్తులు మాత్రమే పనిచేస్తున్నారు. అదేవిధంగా, ఢిల్లీ హైకోర్టు 60 మందికి గానూ 36 మంది న్యాయమూర్తులతో పనిచేస్తుంది' అని ధర్మాసనం తెలిపింది. కనుక న్యాయమూర్తుల పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు నిర్దేశించింది.

హైకోర్టుల న్యాయమూర్తుల నియామకానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల డేటాను ఇటీవల సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. కొలీజియం సిఫార్సులు త్వరగా ఆమోదం పొందేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరింది. నవంబర్ 2022 నుండి క్లియరెన్స్ పెండింగ్‌లో ఉన్న సిఫార్సులతో వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలను ప్రస్తావించింది. వాటిలో 2023లో ఐదు ప్రతిపాదనలు, 2024లో 12 ప్రతిపాదనలు, ప్రస్తుత సంవత్సరంలో మరో 12 ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది.

సింధు జలాల ఒప్పందంలో జోక్యం చేసుకోలేం

- ప్రపంచ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ : సింధు నదీ జలాల ఒప్పందంలో తాము జోక్యం చేసుకోలేమని ప్రపంచ బ్యాంక్ స్పష్టం చేసింది. తమది కేవలం ఫెసిలిటేటర్ (సహాయకారి) పాత్ర మాత్రమేనని పేర్కొంది. ఈ ఒప్పందం విషయంలో భారత్, పాక్ మధ్య ఒక సహాయకుడు లేదా మధ్యవర్తిత్వ పాత్ర తప్ప ప్రపంచ బ్యాంక్ మరే పాత్ర పోషించలేదని ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా చెప్పారు. సింధు, జీలం, చీనాబ్ నదుల జలాలను పంచుకునేందుకు 1960లో ఈ ఒప్పందంపై భారత్, పాక్‌లు సంతకాలు చేశాయి. ఏప్రిల్ 22న పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ ఈ ఒపందాన్ని నిలుపు చేసింది. ఈ సమస్యను ప్రపంచ బ్యాంక్ ఎలా పరిష్కరిస్తుందనే విషయంలో మీడియాలో చాలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి, కానీ అవన్నీ అసత్యాలు, ప్రపంచ బ్యాంక్ కేవలం ఒక ఫెసిలిటేటర్ పాత్ర మాత్రమే పోషించగలదు, అంతకుమించి మరే పాత్ర వుండబోదని అజయ్ బంగాను ఉటంకిస్తూ పిఐబి ఎక్స్ పోస్టులో పేర్కొంది.

మేము జోక్యం చేసుకోం : జెడి వాన్స్

న్యూయార్క్ : భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్న తరుణంలో ఆ విషయంలో తాము జోక్యం చేసుకోవాలనుకోవడం లేదని అమెరికా పేర్కొంది. ప్రాథమికంగా అది తమ పని కాదని వ్యాఖ్యానించింది. గురువారం ఒక టివి ఇంటర్వ్యూలో అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్తాన్‌లను అమెరికా నియంత్రించలేదన్నారు. అయితే ఆ రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించుకునేలా తాము ప్రోత్సహించగలమని చెప్పుకొచ్చారు. అణ్వాయుధ దేశాలు ఎప్పుడైనా ఢీ కొంటే, ప్రధాన ఘర్షణగా మారితే తాము కూడా ఆందోళన చెందుతామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారాలని అమెరికా కోరుకుంటోందని, ఈ మేరకు అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్క్ రూబియో చేసిన ప్రకటనలను వాన్స్ ఉదహరిం చారు. దౌత్యపరమైన మార్గాల ద్వారా ఈ ప్రయత్నం చేయాలని ఆయన కోరారు.

భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు ఆందోళనకరం

- చైనా విదేశాంగ శాఖ మంత్రిత్వ శాఖ

బీజింగ్ : భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల పట్ల చైనా ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడంలో నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకై అంతర్జాతీయ సమాజంతో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా వుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఇరు పక్షాలూ సంయమనం పాటించాలని చైనా కోరింది. ప్రస్తుత పరిణామాల పట్ల బీజింగ్ చాలా ఆందోళనగా వుందని లిన్ జియాన్ పేర్కొన్నారు. భారత్, పాక్‌లు రెండూ ఇరుగు పొరుగు దేశాలే కాదని, ఆ రెండూ కూడా చైనాకు పొరుగు దేశాలని ఆయన గుర్తు చేశారు. అన్ని రూపాల్లోని ఉగ్రవాదాన్ని తాము వ్యతిరేకిస్తామన్నారు. శాంతి, సుస్థిరతల విస్తృత ప్రయోజనాలకు అనుగుణంగా ఇరు పక్షాలు వ్యవహరించాలని కోరుతున్నామని చెప్పారు. ఐక్యరాజ్య సమితి నిబంధనావళితో సహా అంతర్జాతీయ చట్టాలను పాటించాలని కోరారు. ప్రశాంతంగా వుండాలని, సంయమనం పాటించాలని, పరిస్థితులను మరింత సంక్లిష్టం చేసే కార్యాచరణకు దిగకుండా వుండాలని లిన్ జియాన్ సూచించారు.

ఏడుగురు చొరబాటుదారులు హతం

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి భారత్‌లో చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బిఎస్ఎఫ్ తిప్పికొట్టింది. గురువారం రాత్రి 11 గంటల సమయంలో సాంబ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దుల వద్ద ఈ పరిణామాలు చోటుచేసుకొన్నటు బిఎస్ఎఫ్ వెల్లడించింది. ఏడుగురు చొరబాటుదారుల్ని హతమార్చినట్లు తెలిపింది. దీంతోపాటు పాక్‌కు చెందిన ధన్‌బార్‌లోని పోస్టును భారత దళాలు ధ్వంసం చేశాయి.

ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాలు

పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో భారత ఆర్మీ చీఫ్‌కు కేంద్రం మరిన్ని అధికారాలను అప్పగించింది. అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఇందులోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలిచేందుకు అధికారం కల్పించింది. రెగ్యులర్ ఆర్మీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించింది. టెరిటోరియల్ లేదా ప్రాదేశిక ఆర్మీ అంటే సైనిక రిజర్వ్ ఫోర్స్. దేశంలో క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పుడు భారత ఆర్మీతో కలిసి ప్రత్యర్థితో తలపడేందుకు టెరిటోరియల్ ఆర్మీ సిద్ధంగా ఉంటుంది. ఇందులోని సిబ్బంది, అధికారులకు రెగ్యులర్ ఆర్మీ తరహాలోనే శిక్షణ ఇస్తారు. వీరంతా బయట ఉద్యోగాలు చేసుకుంటూనే వాలంటరీగా సైన్యంతో పనిచేస్తుంటారు. 1948లో భారత టెరిటోరియల్ ఆర్మీ చట్టం ఆమోదించారు. ఆ తర్వాత 1949లో అధికారికంగా ప్రారంభమైంది. ప్రస్తుతం దాదాపు 50 వేల మంది వరకు ఈ ఆర్మీలో ఉన్నట్లు సమాచారం. వీరంతా రెగ్యులర్ ఆర్మీలో భాగమే అయినప్పటికీ.. నిరంతరం సైన్యంతోనే ఉండరు. అవసరమైన సందర్భాల్లో కదన, ప్రకృతి వైపరీత్యాల్లో రంగంలోకి దిగుతారు. 1962, 1965, 1971 యుద్ధాల్లో భారత సైన్యంతో కలిసి టెరిటోరియల్ ఆర్మీ పనిచేశారు.

14 వరకూ పలు విమానాశ్రయాల మూసివేత

దేశంలో 24 ఎయిర్‌పోర్టుల మూసివేతను కేంద్రం పొడిగించింది. ఈ నెల 14 వరకు మూసివేత అమలులో ఉంటుందని శుక్రవారం కేంరదం పేర్కొంది. చండీగఢ్, అమృత్‌సర్, లూధియానా, భుంటార్, కిషన్‌గఢ్, పాటియాలా, సిమ్లా, జైసల్మేర్, పఠాన్‌కోట్, శ్రీనగర్, జమ్మూ, బికనీర్, లేహ్, పోర్‌బందర్, ఇతర నగరాల్లోని విమానాశ్రయాలు మే 14 వరకు మూసివేసినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. శ్రీనగర్, జమ్మూ, అమృత్‌సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాల, బికనీర్, జోధ్‌పూర్, కిషన్‌గఢ్, రాజ్‌కోట్‌లకు అన్ని విమానాలను రద్దు చేసినట్లు ఇండిగో, ఎయిర్ ఇండియా ప్రకటించింది.



త్రివిధ దళాధిపతులతో ప్రధాని భేటీ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం సాయంత్రం త్రివిధ దళాధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. డ్రోన్లు, క్షిపణులతో పాకిస్తాన్ దాడులకు తెగబడుతున్న సమయంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో సిడిఎస్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ కూడా పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో, విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అలాగే, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మిలిటరీ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. వీరిలో సిడిఎస్ అనిల్ చౌహాన్ సహ త్రివిధ దళాధిపతులు ఉన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో ప్రధాని మాట్లాడారు. భద్రతా సన్నద్ధతపై ప్రధాని ఆరాతీసి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరంగా సున్నిత ప్రాంతాలైన కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్‌లో పౌరుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అడిగారు

మరోవైపు భద్రతా ప్రోటోకాల్స్ వల్ల ఢిల్లీ విమానాశ్రయంలో విమాన సేవలపై తీవ్ర ప్రభావం పడింది. శుక్రవారం మొత్తం 138 దేశీయ, అంతర్జాతీయ సర్వీసులను రద్దు చేశారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసిన కేరళ

దేశంలో ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పాకిస్తాన్ సరిహద్దు రాష్ట్రాలలోని కుటుంబాలు, విద్యార్థులు సహ కేరళీయులకు సహాయం చేయడానికి కేరళ ప్రభుత్వం 24/7 హెల్ప్‌లైన్‌లతో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. తిరువనంతపురంలోని ప్రభుత్వ సచివాలయంలో కంట్రోల్ రూమ్‌లు పనిచేస్తాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. ఈ నంబర్లు 0471-2517500/2517600, ఫ్యాక్స్: 0471-2322600.

యుద్ధం పరిష్కారం కాదు : ముస్లిం లా బోర్డ్

ఏ సమస్యకు యుద్ధం పరిష్కారం కాదని, దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్‌బి) శుక్రవారం పేర్కొంది. భారత్-పాక్ సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్తతపై బోర్డు ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదం మరియు అమాయక పౌరుల హత్య తీవ్ర ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది. ఇస్లామిక్ బోధనలలో, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన గ్రంధాలలో , మానవ విలువలలో ఉగ్రవాదానికి స్థానం లేదని పేర్కొంది. ఇరు దేశాలు ద్వైపాక్షిక చర్చలు, ఇతర దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని స్పష్టం చేసింది. యుద్ధం ఏ సమస్యకు పరిష్కారం కాదన్నది కూడా వాస్తవమని పేర్కొంది. దేశం, ప్రజల రక్షణ మరియు వారి రక్షణ కోసం తీసుకునే ప్రతి చర్యకు ఎఐఎంపిఎల్‌బి మద్దతు ఇస్తుందని ప్రకటించింది. క్లిష్టమైన సమయాల్లో ప్రజలు, రాజకీయ పార్టీలు, సాయుధ దళాలు మరియు ప్రభుత్వం కలిసి రావాలని స్పష్టం చేసినట్లు బోర్డు పేర్కొంది.

భారత్, పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై ఎఐఎంపిఎల్‌బి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. గురువారం జరిగిన ఆఫీస్ బేరర్ల ప్రత్యేక ఆన్‌లైన్ సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించినట్లు తెలిపింది. తమ 'సేవ్ వక్ఫ్ క్యాంపెయిన్'ను యథావిధిగా కొనసాగిస్తామని, అయితే ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బహిరంగ సమావేశాలు , కార్యక్రమాలను మే 16 వరకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

రెడ్ స్క్వేర్‌లో ఘనంగా విక్టరీ డే పరేడ్ ఉత్సవాలు





సైనికుల కవాతు (ఇన్‌సెట్‌లో) రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో పాటు వివిధ దేశాధినేతలు

- కళ్లు చెదిరేలా 11 వేల మందికి పైగా సైనికుల కవాతు
- 30 మందికి పైగా ప్రపంచ నేతల హాజరు
- రష్యా ఫోబియాకు వ్యతిరేకంగా పోరు కొనసాగుతుందన్న పుతిన్

మాస్కో : విక్టరీ డే పరేడ్ సందర్భంగా రష్యా శుక్రవారం ఉదయం రెడ్ స్క్వేర్‌లో తన సైనిక పాటవాన్ని ప్రదర్శించింది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై సోవియట్ యూనియన్ సాధించిన విజయానికి గుర్తుగా మాస్కోలో జరుగుతున్న ఈ విజయోత్సవాలకు దాదాపు 30 మందికి పైగా ప్రపంచ నేతలు హాజరయ్యారు. హాజరైన వారిలో చైనా అధ్యక్షులు షి జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షులు లూలా డసిల్వా, వెనిజులా అధినేత నికొలస్ మదురో, క్యూబా అధ్యక్షులు కానెల్ సహా పలువురు రష్యా మిత్ర దేశాల నేతలు కూడా వున్నారు. ఈ ఉత్సవాలకు వచ్చిన యురోపియన్ నేతల్లో సెర్బియా, స్లోవేకియా అధ్యక్షులు మాత్రమే వున్నారు. చివరి నిముషంలో అజర్‌బైజాన్, లావోస్ అధ్యక్షుల పర్యటనలు రద్దయ్యాయి. అమెరికా నుండి ఉన్నత స్థాయిలో అధికారులెవరూ ఈ పరేడ్‌లో పాల్గొనలేదు. ఆర్మేనియా, ఇజ్రాయిల్, మంగోలియా, అమెరికా సహా పలు దేశాలకు చెందిన రెండో ప్రపంచ యుద్ధ వీరులు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. పరేడ్ ప్రారంభం కాగానే రష్యా రక్షణ మంత్రి ఆండ్రె బెలూసొవ్ సైనిక బలగాలను అభినందించారు. పరేడ్‌లో 11 వేల మందికి పైగా సైనికులు కవాతు నిర్వహించారు. ప్రత్యేక మిలటరీ ఆపరేషన్ పేరుతో ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొన్న మరో 1500 మంది సైనికులు కూడా ఈ కవాతులో పాల్గొన్నారు. మిత్రదేశాల సైన్యం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంది.

మాస్కోతో పాటుగా రష్యా వ్యాప్తంగా ఇతర నగరాలైన సెయింట్ పీటర్స్‌బర్గ్, వ్లాదివొస్తొక్, ఉలన్-ఉద్, నొవొసిబిర్‌స్తిక్, ఉఫా, కజన్, తదితర నగరాల్లో విక్టరీ డే ఉత్సవాలు జరిగాయి. రెడ్ స్క్వేర్‌లో సాంప్రదాయ విజయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుతిన్ ప్రసంగించారు. "వాస్తవం, న్యాయం మన పక్షాన వున్నాయి. యావత్ దేశం - మన సమాజం, మన ప్రజలు ఈ ప్రత్యేక మిలటరీ ఆపరేషన్‌లో పాల్గొన్నవారి వెంట వున్నారు." అని వ్యాఖ్యానించారు. "వారి సాహసాన్ని, కృత నిశ్చయాన్ని చూసి మేం గర్వపడుతున్నాం. ఆ స్ఫూర్తి బలమే మాకు ఎప్పుడూ విజయాన్ని అందిస్తుంది." అని పుతిన్ పేర్కొన్నారు. నాజీవాదం, రష్యా ఫోబియా, యూదు విముఖతలకు వ్యతిరేకంగా రష్యా పోరాటాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధం నుండి నేర్చుకున్న గుణపాఠాలను గుర్తుంచుకుంటామన్నారు. ఆ సంఘటనలను వక్రీకరించడాన్ని ఎన్నడూ అనుమతించబోమన్నారు.

పుతిన్ ప్రసంగం ముగిసిన తర్వాత, దాదాపు 200 ట్యాంకులు పరేడ్‌లో ప్రదర్శన చేశాయి. వీటిలో రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి టి-34 ట్యాంక్‌లు కూడా వున్నాయి. వివిధ రకాలైన సాయుధ వాహనాలు, శతఘ్ని వ్యవస్థలు, డ్రోన్‌లు, పదాతి దళ వాహనాలు అన్నీ రెడ్ స్క్వేర్ వ్యాప్తంగా ప్రదర్శనలో ముందుకు సాగాయి. ఆ వెనుకనే యుద్ధ విమానాలు, బాంబర్లు తమ విన్యాసాలతో అనుసరించాయి.

ద వైర్ వెబ్ పోర్టల్ బ్లాక్

- విమర్శలతో దిగొచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ : స్వతంత్ర మీడియా సంస్థ 'ది వైర్' వెబ్ పోర్టల్ ను కేంద్ర ప్రభుత్వం బ్లాక్ చేసింది. ఈ విషయాన్ని ద వైర్ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే దీనిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తంకావడంతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. 'ద వైర్' వెబ్ పోర్టల్‌పై దిగ్బంధాన్ని తొలగించింది. అయినా శుక్రవారం సాయంత్రం కూడా పోర్టల్ ఓపెన్ కాలేదు. దీంతో కేంద్రం తీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది కచ్చితంగా మీడియా స్వేచ్ఛను హరించివేయడమేనని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచార, సాంకేతిక అంశాలకు సంబంధించిన 'ఐటి చట్టం - 2000' కింద 'ద వైర్'ను ప్రభుత్వం బ్లాక్ చేసినట్లు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్, అనంతర పరిణామాల నేపథ్యంలో సరిహద్దులో ఉద్రిక్తతలు నెలకొన్న దరిమిలా..గురువారం నుంచి మక్తూబ్ మీడియా, ది కాశ్మీరీ యూత్, ఫ్రీ ప్రెస్ కాశ్మీర్ వార్తా సంస్థల వెబ్‌సైట్లను, సామాజిక మాధ్యమాల్లోని వివిధ ఖాతాలను కేంద్ర ప్రభుత్వం బ్లాక్ చేసింది. ఈ క్రమంలోనే 'ది వైర్' వెబ్ పోర్టల్‌ను కూడా బ్లాక్ చేసింది. అయితే స్వతంత్ర మీడియాగా సంచలనాత్మక కథనాలు అందించిన 'ది వైర్' పోర్టల్‌ను బ్లాక్ చేయడం పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా జర్నలిస్టుల సంఘాలు విమర్శించాయి. దేశంలో కీలకమైన సమయంలో ఇటువంటి చర్యలు హేతుబద్ధమైన ఆలోచనను అడ్డుకుంటాయని పేర్కొంది. యుద్ధం ఆవశ్యకత, భయానక పరిస్థితులను, స్వతంత్ర జర్నలిజాన్ని అణచివేసేందుకు సాకుగా వినియోగించలేమని ఆగ్రహం వ్యక్తం చేసింది.

సిపిఎం ఖండన

వైర్ వెబ్ పోర్టల్‌ను బ్లాక్ చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పత్రికా స్వేచ్ఛను అడ్డుకునే ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొంది. ఆపరేషన్ సిందూర్‌పై నిరంతరాయంగా అసత్య వార్తలను ప్రచారం చేస్తున్న టివి చానల్స్‌ను ఎలాంటి హెచ్చరికలు లేకుండా అనుమతించడం, విశ్వసనీయమైన వైర్ వంటి వార్తా చానెల్స్‌ను బ్లాక్ చేయడం సిగ్గుచేటు అని పేర్కొంది.

త్వరలోనే 'తల్లికి వందనం'

(మొదటిపేజీ తరువాయి)

నీళ్లను మళ్లించవచ్చన్నారు. తద్వారా రాష్ట్రంలో కరువు అన్నది ఉండబోదని పేర్కొన్నారు. హంద్రీనీవాను పూర్తి చేస్తే రాయలసీమ జిల్లాల్లో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం సాగునీటిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. అంతకు ముందు టిడిపి హయాంలో 2014-2019 మధ్య ఐదేళ్లలో సాగునీటికి రూ.72 వేల కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. ఇందులో రాయలసీమ జిల్లాల్లో రూ.12 వేల కోట్లు నిధులు ఖర్చు చేశామన్నారు. ఇప్పుడు హంద్రీనీవాకు రూ.3500 కోట్లు ఖర్చు పెడుతున్నామని తెలిపారు. ప్రాజెక్టు పనులను వేగవంతంగా చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నామని తెలిపారు. పి-4 ద్వారా పేదలను గుర్తించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారు మార్గదర్శకాలుగా ఉంటూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని, ఇందుకు ఆర్థికంగా ఉన్నవారు ముందుకు రావాలని కోరారు. ఛాయపురంలో 96 బంగారు కుటుంబాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయడానికి మార్గదర్శకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

ఐకమత్యం



దొరపురం అనే చిన్న ఊరు సిటీకి చాలా దూరంగా ఉంది. ఆ ఊళ్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయి. అక్కడ పోలీసు స్టేషన్ లేదు. దీంతో పోలీసులు కొన్ని రోజులకోసారి ఊరికి వచ్చి గస్తీ వేస్తూ ఉండేవారు.

పోలీసులు గస్తీ వేసిన రోజు దొంగలు ఊళ్లోకి వచ్చేవారు కాదు. ప్రతి సారీ ఇలాగే జరుగుతోంది. ఊరి వాళ్లు దాచుకున్న సొమ్ము దొంగలు దోచుకోవడం, పోలీసులకి చిక్కకుండా పారిపోవడం పరిపాటి అయ్యింది. 'ఇలా ఇంకెన్ని రోజులు?' అని ఊర్లో ఉన్న రాము ఓ ఉపాయం ఆలోచించాడు. పొరుగింటి వాళ్లందరినీ పిలిచి 'ఈ రోజు రాత్రి మనకు దొంగల వల్ల ప్రమాదం ఉండొచ్చు. మనమందరం కలిసి ఉపాయంతో దొంగలను పోలీసులకు పట్టిద్దాం' అని చెప్పాడు.

అందరూ 'సరే' అన్నారు. వాళ్లందరూ రాము చెప్పినట్లు ఓ ఇంట్లో తమ విలువైన వస్తువులు బంగారం, డబ్బు దాచారు. ఆ ఇంట్లోనే పెద్దలు, పిల్లలు నిద్రపోతున్నట్లు నటించారు.

రాత్రి అయింది. ఊరంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడో కుక్క అరుపు వినిపించింది. అంతలోనే ఇంట్లోకి దొంగ ప్రవేశించాడు! అయితే, రాము, దొంగ ఊహించని పథకం వేసాడు. రాము ఆలోచన ప్రకారం ఊరివాళ్లు ఒక గదిలో దీపం వెలిగించారు. బంగారం, డబ్బును మరో చీకటి గదిలో భద్రపర్చారు. వెలుగు ఉన్న గదిలోనే సొమ్ము ఉంటుందని దొంగలు భావించారు.



దొంగలు ఆ గదిలోకి ప్రవేశించగానే నిద్రపోతున్నట్లు నటిస్తున్న ఊరివాళ్లు, రాము కలసి వాళ్లని పట్టుకుని కర్రకి కట్టేశారు! తెల్లారేసరికి సరికి, పోలీసులు వచ్చి దొంగలను అరెస్ట్ చేశారు. అందరూ రాము తెలివిని పొగిడారు.

– నాగిళ్ళ రోహన్ ప్రథమ్,
6వ తరగతి, భాష్యం స్కూలు,
మీర్‌పేట్, హైదరాబాద్.



మార్పు కోసం ...

మల్లవరం అనే ఊరిలో రామయ్య, సీతమ్మ దంపతులు ఉన్నారు. వారికి రమ, రాము అనే ఇద్దరు పిల్లలు. కొన్ని సంవత్సరాల తర్వాత రామయ్య దుర్వ్యసనాలకు అలవాటు పట్టాడు. ఎవరు ఎంత చెప్పినా వినలేదు.

ఆ రోజు రమ పదవ పుట్టినరోజు. సీతమ్మ, తమ్ముడు రాము, రమకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. రమ ఎంతో సంతోషించింది. రామయ్య మాత్రం చెప్పలేదు. అసలు అతనికి గుర్తు కూడా లేదు. ఎప్పుడూ మత్తులో ఉంటున్నాడు. రామయ్య పరిస్థితికి రమ ఎంతో బాధపడింది. తండ్రిలో మార్పు తేవాలని బలంగా అనుకుంది.

కొన్ని రోజులకి రాము పుట్టినరోజు వచ్చింది. ఆ రోజు కూడా రామయ్య అలాగే ప్రవర్తించాడు. అప్పుడు రమ తండ్రి దగ్గరికి వెళ్లింది. 'నాన్న, మీరు ఈ వ్యసనాల నుండి దూరంగా రండి. ఇది మిమ్మల్నే కాదు, మమ్మల్ని కూడా పాడుచేస్తోంది. మీ ప్రవర్తన వల్ల అమ్మ, నేను, తమ్ముడు చాలా బాధపడుతున్నాం. బంధువుల్లో మన పరువు పోతోంది. ఎవరూ మమ్మల్ని గౌరవంగా చూడడం లేదు. ఇది మేము భరించలేకపోతున్నాం. ఈ రోజు తమ్ముడి పుట్టినరోజు. మీరు ఈ రోజు సాయంత్రం పని నుండి ఇంటికి వచ్చేటప్పుడు తమ్ముడి కోసం కేక్ తీసుకురండి. అలా అని మాకు మాట ఇవ్వండి. అప్పుడు మీరు మారారని మేమంతా నమ్ముతాం. మమ్మల్ని అర్థం చేసుకోండి నాన్న' అని ఏడుస్తూ బతిమాలింది.

రమ మాటలు రామయ్యపై ప్రభావం చూపాయి. ఆ రోజు నుండి మత్తు పదార్థాల వైపు వెళ్లకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాడు. ఇచ్చిన మాట ప్రకారం ఆరోజు సాయంత్రం ఇంటికి కేక్ తీసుకెళ్లాడు. అతనిలో వచ్చిన మార్పు చూసి కుటుంబం సంతోషపడింది.



– బి.రవి త్రేయని,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా,
99590 07914.

బొమ్మల కొలువు





జె.సంజయ్ రత్నం,
3వ తరగతి,
లిటిల్ ఫ్లవర్ స్కూలు, విద్యానగర్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com వాట్సాప్ : 83329 25496

జీవన సౌరభం

బాధ్యతను గ్రహించినప్పుడే ఆశయాలను పూర్తి చేసుకోవాలనే పట్టుదల వస్తుంది.

JEEVANA జీవన the family

కళారంగ తేజ .. సాధినేని శ్రీజ

తెలుగువారి సంప్రదాయ కళారూపమైన హరికథాగానంలో ఆమె దిట్ట. ఒకేసారి అన్ని పాత్రల్లోనూ జీవించి రసవత్తరంగా నటించటంలో మేటి. మూడుగంటలపాటు ప్రేక్షకులకు విసుగు రాకుండా మధ్యలో పిట్టకథలతో హాస్యరసాన్ని పోషిస్తూ సమాజంలోని కుళ్లును ఎత్తిచూపిస్తూ జనరంజకంగా హరికథాగానం చేస్తారామె. ఆమె సాదినేని శ్రీజ ... కథా వాచస్పతి, అభినేత్రి, గానకోకిల, కథా విశారద వంటి బిరుదులను కైవసం చేసుకున్నారు. బాల భాగవతారిణిగా రంగప్రవేశం చేసి, ఆ తర్వాత నాటకాల్లోనూ, టీవీ, సినిమాల్లోనూ నటించి ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. 3000లకు పైగా అవార్డులను కైవసం చేసుకున్నారు.



ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ప్రముఖ హరికథా విద్వాంసులు సాదినేని నాగేశ్వరరావు, భారతీదేవి దంపతుల కుమార్తె డాక్టర్ శ్రీజ సాదినేని. మాస్టర్ ఆఫ్ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (ఎంపిఎ)లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. టాపర్‌గా నిలిచి యూనివర్శిటీలో గోల్డ్‌మెడల్ సాధించారు. 33 నాటకాలకు దర్శకత్వం వహించిన తొలి తెలుగు మహిళా దర్శకురాలిగా రికార్డులకెక్కారు. బాల్యంలోనే హరికథా గానం చేస్తున్న శ్రీజను వేదికపై చూసిన రంగస్థల నటులు, దర్శకులు కె.శాంతిబాబు తన 'మేడిపండు' నాటికలో బాలనటిగా నాటక రంగానికి పరిచయం చేశారు. అలా ఓవైపు చదువు, మరో వైపు నాటక రంగంలో మమేకమై హావభావాలు పలికించగల ప్రతిభాశాలిగా పేరుగాంచారు. డైలాగు డెలీవరీలో కొత్తదనం చూపేవారు. నటనలో వైవిధ్యం, ఆహార్యంలో నిండుదనం ఉండటంతో ఆనాటి ప్రముఖ కళాకారులు ఆమెను ప్రోత్సహించి అవకాశాలు కల్పించేవారు. ఇలా చదువును కొనసాగిస్తూనే తనకు ఇష్టమైన నాటకరంగంలో ప్రవేశం చేసి 400లకుపైగా నాటిక, నాటకాల్లో నటించారు. 34 తెలుగు నాటకాలకు దర్శకత్వం వహించారు కూడా. కళారంగంపై ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించి యాక్టింగ్, యాంకరింగ్, డబ్బింగ్, న్యూస్‌రీడింగ్, స్క్రిప్ట్ రైటింగ్, డైరెక్షన్ వంటి విభాగాల్లో 2500 మందికి శిక్షణ ఇచ్చారు. శ్రీజ కొటేషన్స్ (నిప్పులాంటి నిజాలు), త్రినయని, అభిసారిక పుస్తకాలను ఆమె ముద్రించారు.

నటనలో వైవిధ్యం..

సాంఘిక నాటకాలే కాక పద్య నాటకాల్లో కూడా వైవిధ్యమైన పాత్రలు పోషించారు. సత్యభామ, మోహిని, లక్ష్మీదేవి, పార్వతి, రుక్మిణి, సుభద్ర, తార, వరూధిని, మధురవాణి, లకుమాదేవి, రుద్రమదేవి, రాణీ రాస్మణీదేవి, సమ్మక్క, చాకలి ఐలమ్మ, మదర్‌థెరిస్సా వంటి ఎన్నో పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా అనిపించుకున్నారు.

శ్రీ జయా ఆర్ట్స్ బ్యానర్‌లో...

శ్రీ జయా ఆర్ట్ బ్యానర్ ద్వారా ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తున్నాం. మూడు దశాబ్దాల నట ప్రస్థానంగా నటిగా, రచయిత్రగా, దర్శకురాలిగా, లైటింగ్, మేకప్, సెట్ డిజైనింగ్ ఆర్టిస్ట్‌గా, ఈవెంట్ మేనేజర్‌గా, నాటక నిర్మాతగా, నాటక పరిషత్ నిర్వాహకురాలు, యాక్టింగ్ ఫ్యాకల్టీగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, యాంకర్‌గా, షార్ట్ ఫిల్మ్ దర్శక, నిర్మాత, యూట్యూబర్‌గా నా వంతుగా కళామతల్లి సేవ చేస్తున్నా.

- డాక్టర్ శ్రీజ సాదినేని, సినీనటి.

కథానాయికగా...

తెలుగు సినిమా పరిశ్రమలో ఎర్ర సముద్రం, కోయిల సినిమాల్లో కథానాయికగా నటించారు. ఆర్.నారాయణమూర్తి దర్శకత్వం వహించి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. కోయిల సినిమాలో వేణుమాధవ్ కథానాయకుడిగానూ శ్రీజ కథానాయికగా నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పాండురంగడు, ఇక అంతా శుభమే పెళ్లి జరిపించండి, యు అండ్ ఐ, కోనసీమలో చిట్టెమ్మ కిట్టయ్య, సోంబేరి, పాండవులు, ఇది కలకాదు, గరివిడి లక్ష్మి సినిమాల్లో నటించారు. అసోసియేట్ రైటర్‌గా 125, అసోసియేట్ డైరెక్టర్‌గా ఐదు, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా 400లకుపైగా, 20కిపైగా వెబ్‌సిరీస్‌లోనూ ఆమె గాత్రాన్ని అందించారు. త్వరలో ఆమె దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కబోతోంది.

టెలివిజన్ రంగంలో...



టెలివిజన్ రంగంలో కూడా ఆమె కీలకపాత్ర పోషించారు. 108 టివి ప్రోగ్రామ్ హెడ్‌గానూ, అమెజే టివికి సిఇఒగా పనిచేశారు. ప్రోగ్రామ్ డైరెక్టర్, రచయిత, యాంకర్, న్యూస్‌ప్రజెంటర్, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా పలు టీవీ సంస్థల్లో పనిచేశారు. ఆమె దర్శకత్వంలో 8 షార్ట్ ఫిల్మ్‌ను నిర్మించారు. రుతు రాగాలు, కస్తూరి, విధి, అలౌకిక, అన్వేషిత, చక్రవాకం, ఇల్లాలు ప్రియురాలు, తోడికోడళ్లు, మానస, సంగ్రామం, పితృదేవోభవ వంటి సీరియళ్లలో నటించి మెప్పించారు.

ఔత్సాహికులకు ప్రోత్సాహం

2003 నుంచి ఇప్పటివరకూ సినీ ఔత్సాహికులకు యాక్టింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. దర్శకత్వం, ప్రొడక్షన్ రంగంలోకి కొత్తవారిని ప్రోత్సహిస్తున్నారు. 2008 నుంచి సినీ నటిగా కొనసాగుతున్నారు.

-యడవల్లి శ్రీనివాసరావు

'థగ్‌లైఫ్' ఆడియో వేడుక వాయిదా



కథానాయకుడు కమల్‌హాసన్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న చిత్రం 'థగ్‌లైఫ్'. ఈనెల 16న ఈ సినిమా ఆడియో వేడుక చెన్నైలో జరగాల్సివుంది. భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు కమల్‌హాసన్ ప్రకటించారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. 'ఆర్ట్ కెన్ వెయిట్... ఇండియా కమ్స్ ఫస్ట్' అనే శీర్షికతో ఒక ప్రకటన విడుదల చేశారు. 'మన దేశ సరిహద్దులో జరుగుతున్న పరిణామాలు, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మే 16న జరగాల్సిన 'థగ్‌లైఫ్' ఆడియో విడుదలను వాయిదా వేస్తున్నాం. తిరిగి షెడ్యూల్ వివరాలను తెలుపుతాం. మన సైనికులు మన మాతృభూమి పరిరక్షణలో అంచంచలమైన ధైర్యంతో ముందు వరుసలో ఉండి పోరాటం చేస్తున్నారు. ఇది నిశ్శబ్ద సంఘీభావం కోసం నిర్ణయం తీసుకుంటున్నాం. వేడుకలకు ఇది సరైన సమయం కాదని నేను నమ్ముతున్నా. కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తాం' అని ఆయన పేర్కొన్నారు. 'నాయగన్' (1987) వంటి హిట్ మూవీ తర్వాత 38 సంవత్సరాలకు మళ్లీ కమల్‌హాసన్-మణిరత్నం కాంబినేషన్‌లో 'థగ్‌లైఫ్' సినిమా రానుంది. శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యాలక్ష్మి, జోజు జార్జ్, అభిరామి, నాజర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఉదయనిధి స్టాలిన్, ఆర్.మహేంద్రన్; శివ అనంత్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన నిర్మించిన ఈ సినిమా జూన్ 5న విడుదల కానుంది. ఎఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా, రవి కె చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

15న రామ్ సినిమా కొత్త టైటిల్

రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేష్‌బాబు దర్శకత్వంలో కొత్త సినిమా తెరకెక్కుతోంది. పీరియాడికల్ లవ్‌స్టోరీ మూవీలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు. రావు రమేష్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో సాగర్ పాత్రలో రామ్, మహాలక్ష్మి పాత్రలో భాగ్యశ్రీ బోర్సే కనిపిస్తారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈనెల 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తామని నిర్మాతలు గురువారం వెల్లడించారు.



30న 'భైరవం'



మంచు మనోజ్, నారా రోహిత్, బెల్లంకొండ సాయిశ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. అదితి శంకర్, దివ్యా పిళ్లై, ఆనంది కథానాయికలు. మే 30న ప్రపంచవ్యాప్తంగా దీన్ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. దీనికి సంబంధించిన కొత్త పోస్టర్‌ను అభిమానులతో పంచుకుంది.

కథానాయకుడిగా లోకేశ్ కనకరాజ్



కోలీవుడ్ దర్శకుడు లోకేశ్ కనకరాజ్ కథానాయకుడిగా మారబోతున్నారు. 'మానగరం' అనే చిన్న సినిమాతో దర్శకుడిగా పరిచయమై పెద్ద విజయాన్ని ఆయన అందుకున్నారు. ఆ తర్వాత ఖైదీ, మాస్టర్, విక్రమ్, లియో వంటి భారీ చిత్రాలను తెరకెక్కించారు. లియో ఆశించిన విజయాన్ని అందించకపోయినా వసూళ్ల వర్షం కురిపించింది. మిగతా అన్ని సినిమాలు సూపర్‌హిట్టయ్యాయి. రజనీకాంత్ కథానాయకుడిగా 'కూలీ' చిత్రానికి కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇది విడుదలయ్యాక 'ఖైదీ 2', 'విక్రమ్ 2', రోలెక్స్ వంటి చిత్రాలకు దర్శకత్వం వహించాల్సివుంది. మరో పక్క నిర్మాతగానూ చిత్రాలను కూడా నిర్మిస్తున్నారు. తాజాగా కథానాయకుడిగా నటించడానికి ఆయన సిద్ధమవుతున్నారు. ధనుష్ కథానాయకుడిగా 'కెప్టెన్ మిల్లర్' చిత్రాన్ని తెరకెక్కించిన అరుణ్ మాదేశ్వరన్ దర్శకత్వం వహించనున్నట్లుగా తెలిసింది. లోకేశ్ కనకరాజ్ ఇటీవల నటి శృతిహాసన్‌తో కలిసి ఓ వీడియో ఆల్బమ్‌లో నటించారు.

ఐపిఎల్ వాయిదా

- సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలోనే..
- 57మ్యాచ్‌లు పూర్తి.. 16మ్యాచ్‌లకు బ్రేక్
- డబ్బులు వాపస్ ఇస్తాం: ఫ్రాంచైజీలు



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18 వారంరోజులు వాయిదా పడింది. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో టోర్నీ నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపిఎల్ మిగిలిన మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటించారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఫ్రాంచైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఐపిఎల్ పాలక మండలిలో చర్చించాం. ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. మన సాయుధ బలగాల స్థైర్యం, సన్నద్ధతపై మాకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ.. అందరి అభిప్రాయాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఐపిఎల్ తమ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది. ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో టోర్నీని కొంతకాలం వాయిదా వేసినట్లు బిసిసిఐ అధికారులు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం లక్నో వేదికగా లక్నో-బెంగళూరు జట్ల మధ్య ఏకనా స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉంది. ధర్మశాల వేదికగా ఢిల్లీ-పంజాబ్ జట్ల మధ్య గురువారం జరగాల్సిన మ్యాచ్ కూడా అర్ధాంతరంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇక ఈ సీజన్‌లో ఇంకా 12 లీగ్ మ్యాచులు, రెండు క్వాలిఫయర్లు, ఒక ఎలిమినేటర్, మే 25న కోల్‌కతా వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉన్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 57 లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇంకా 16 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	+0.79
బెంగళూరు	11	8	3	0	16	+0.48
పంజాబ్	11	7	3	1	15	+0.37
ముంబయి	12	7	5	0	14	+1.15
ఢిల్లీ	11	6	4	1	13	+0.36
కోల్‌కతా	12	5	6	1	11	+0.19
లక్నో	11	5	6	0	10	-0.46
సన్‌రైజర్స్	11	3	7	1	7	-1.19
రాజస్తాన్	12	3	9	0	6	-0.71
చెన్నై	12	3	9	0	6	-0.99

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

డబ్బులు రీఫండ్ చేస్తాం: సన్‌రైజర్స్

ఐపిఎల్ టోర్నమెంట్‌ను వారంరోజులు వాయిదా వేయడాన్ని అన్ని ఫ్రాంచైజీలు మద్దతు తెలిపాయి. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సహా పలు ఫ్రాంచైజీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈ వారం రోజుల్లో జరిగే మ్యాచ్‌ల టికెట్ డబ్బులను వాపస్ ఇస్తామని ఆయా ఫ్రాంచైజీలు 'ఎక్స్' వేదికగా వెల్లడించాయి. మే 10న (శనివారం) ఉప్పల్ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడాల్సి ఉంది. దీంతో ఆ మ్యాచ్ టికెట్లు కొన్నవాళ్లకు డబ్బులు రీఫండ్ చేస్తాం' అని ఆరెంజ్ ఆర్మీ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. అలాగే లక్నో-బెంగళూరు మధ్య లక్నోలోని ఏక్నా స్టేడియంలో శుక్రవారం జరగాల్సిన మ్యాచ్‌కు సంబంధించి తిరిగి ఇచ్చేస్తామని ఆ ఫ్రాంచైజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

సెమీస్‌కు ఆయుశ్, ఉన్నతి

- తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

తైపీ సిటీ(చైనా): తైపీ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 16-21, 21-19, 21-14తో బి.యంగ్(కెనడా)పై చెమటోడ్చి నెగ్గాడు. ముఖ్యంగా రెండో గేమ్‌లో ఇరువురు షట్లర్లు ప్రతి పాయింట్ కోసం పోరాడారు. ఆ సెట్‌లో ఆయుశ్ చేజిక్కించుకొని.. మూడో గేమ్‌లో యంగ్‌కు ఆయుశ్ ముచ్చెమటలు పట్టించి ఆ గేమ్‌ను సునాయాసంగా చేజిక్కించుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో ఉన్నతి ఉన్నతి హుడా కూడా సంచలనం నమోదు చేసింది. తనకంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న తైపీకి చెందిన వై.యంగ్‌పై మూడుసెట్ల హోరాహోరీ పోరులో చిత్తు చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఆ గేమ్‌లో ఉన్నతి 21-8తో తొలి గేమ్‌ను చేజిక్కించుకొని.. రెండో గేమ్‌లో పోరాటాపోటీగా తలపడి 19-21తో ఆ సెట్‌ను కోల్పోయింది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో 21-19తో చేజిక్కించుకొని సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో ఉన్నతి జపాన్‌కు చెందిన మియాజాకితో తలపడనుంది.

రికర్వు సెమీస్‌కు దీపిక, పార్థ్

న్యూఢిల్లీ: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2 వ్యక్తిగత విభాగాల్లో దీపిక కుమారి, పార్థ్ సలుంకే సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ పోటీలో పార్థ్ మూడు సార్లు ఒలింపిక్ ఛాంపియన్ కొరియాకు చెందిన కిమ్-జె-డియాక్‌ను చిత్తుచేశాడు. తొలిరౌండ్‌లో ఏకంగా మాజీ ఒలింపిక్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ మాటే గజోజ్(టర్కీ)ను షూట్-ఆఫ్‌లో ఓడించిన పార్థ్... ఆదివారం జరిగే వ్యక్తిగత సెమీస్‌లో పార్థ్ కొరియాకే చెందిన పారిస్ ఒలింపిక్స్ ఛాంపియన్ కిమ్ పూజిన్‌తో తలపడతాడు. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో దీపిక కుమారి పారిస్ ఒలింపిక్స్ టీమ్ రజత పతక విజేత, చైనాకు చెందిన లీ-జియామన్‌పై 6-2తో విజయం సాధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68